
అక్షర రూపిణి.. అమృత వర్షిణి

సరస్వతీ దేవి దర్శనానికి తరలివచ్చిన జనసంద్రం


అక్షరాభ్యాసం


తరలివచ్చె భవానీలు





విద్యాధరీ నమోస్తుతే




ఇంద్రకీలాద్రి ధగధగ






అంబరం తాకిన వాద్య సంరంభం


తల్లీ వందనం


దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, డిజిటల్ – అమరావతి

ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రమైంది. మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మను దర్శించుకునేందుకు.. లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. కొండ దిగువన రెండు కిలోమీటర్ల వరకూ క్యూలైన్లు, వాటి పక్కనున్న రహదారులు, ఘాట్‌రోడ్డు మొత్తం భక్తులతో కిక్కిరిశాయి. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా.. సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో బారికేడ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదులన్నీ అర్ధరాత్రి నుంచే భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి రాత్రి 12.30 గంటల తర్వాత భక్తులను క్యూలైన్లలోకి వదిలారు. ఆపై బుధవారం అర్ధరాత్రి వరకూ క్యూలైన్లు రద్దీగానే నడిచాయి. వినాయక ఆలయం దగ్గర నుంచి పైవరకు రెండు కిలోమీటర్లకు పైగా భక్తులు రోజంతా కిక్కిరిసి క్యూలైన్లలో కనిపించారు. ఒక్క రోజులో రెండు లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతీ దేవి రూపంలోని అమ్మ దర్శనానికి విద్యార్థులు, యువత అధికంగా తరలివచ్చారు. ఏడు రోజుల్లో ఇప్పటివరకూ ఆరున్నర లక్షల మందికి పైగా భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఏటా మాదిరిగానే.. ఈసారి కూడా భక్తులు మూలానక్షత్రం రోజు భారీగా పోటెత్తుతారని ముందే అంచనా వేసి పక్కాగా ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు.

వేకువన మాత్రం భక్తులంతా ఒకేసారి ఘాట్‌రోడ్డు మీదుగా ఆలయం వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు రద్దీ ఏర్పడింది. తర్వాత వారందరినీ క్యూలైన్లలోకి పంపడంతో ఆ తర్వాత నుంచి క్యూలైన్లు సాఫీగా సాగాయి.

నేటి అలంకారం శ్రీ దుర్గాదేవి..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో గురువారం జగన్మాత.. శ్రీ దుర్గాదేవి రూపంలో దర్శనం ఇవ్వనుంది. **దర్శన వేళలు:** ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు.

ఆలయ అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శన..

ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గమ్మను దర్శించుకుని.. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు బాగా చేశారని కొనియాడటంతో అధికారుల ఆనందానికి అవధులు లేవు. ఆలయంలో అభివృద్ధి పనుల చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ముఖ్యమంత్రి కుటుంబానికి వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. తర్వాత సి.హెచ్.ఆంజనేయశాస్త్రి వేదాశీర్వచన మంత్రాల వివరణను తెలియజేయడంతో.. చంద్రబాబు, లోకేశ్ సహా కుటుంబ సభ్యులంతా ఆసక్తిగా విన్నారు. అమ్మవారికి రాజభోగం కింద నివేదించే.. ఐదు రకాల ప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. వీటిలో పులిహోర, పొంగలి, కట్టెపొంగలి, పాయసం, లడ్డూ ఉన్నాయి. ఈ రాజభోగాన్ని అమ్మవారికి ఎందుకు నివేదిస్తారనే అంశాన్ని ఆలయ అర్చకులు శంకర శాండిల్య వివరించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనా చౌదరి, కలెక్టర్ సృజన, విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు ఉన్నారు.


కమనీయం.. నగరోత్సవం
గంగాపార్వతీ సమేత దుర్గామల్లేశ్వర ఉత్సవమూర్తుల ఊరేగింపు



మూలా నక్షత్రం పురస్కరించుకొని దుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆయన సతీమణి భువనేశ్వరి.. మంత్రి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ ఉన్నారు. బుధవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తన కుమార్తె ఆద్యతో కలిసి దుర్గమ్మ సేవలో పాల్గొన్నారు.

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన

తెదేపా సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: గుంటూరు పట్టాభిపురంలోని భజరంగ్ జూట్‌మిల్లు స్థలంలో చేపట్టిన గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో అడగుడుగునా నిబంధనల్ని ఉల్లంఘించారని తెదేపా సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన అన్ని శాఖల అధికారులకీ ఈ పాపంలో భాగం ఉందని ధ్వజమెత్తారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'రైల్వే అధికారులు కూడా నిబంధనలు పట్టించుకోలేదు. రైల్వే ట్రాక్ వెంట పేదలు గుడిసెలు వేస్తే వెంటనే తొలగిస్తారు. ప్రధాన రైల్వే లైన్ వెంట భారీ భవన సముదాయం నిర్మిస్తుంటే రైల్వే శాఖ అధికారులు ఏం చేస్తున్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ లేఖ రాస్తే సరిపోదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసుల ఇచ్చి సరిపెడితే ఉపయోగం లేదు. భవన నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది'.. అని పేర్కొన్నారు.

రీజియన్‌కు 97 కొత్త బస్సులు


వివరాలు తెలుపుతున్న డీపీటీవో ఎం.రవికాంత్, పక్కన తెనాలి ఆర్టీసీ డీఎం, అసిస్టెంట్ డీఎం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుంటూరు ఆర్టీసీ రీజియన్‌కు 97 కొత్త బస్సులు మంజూరు అయ్యాయని, వాటిలో ఇప్పటికే 52 వచ్చాయని, రెండు నెలల్లో మిగిలినవి డిపోలకు చేరతాయని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఆయన బుధవారం తెనాలి డిపోలో డిపో మేనేజర్ ఏ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐ.జె.ప్రసాద్ ఇతర అధికారులతో ఆదాయం, సేవలు తదితరాలపై మాట్లాడారు, దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ మంగళగిరి వద్ద ఉన్న ఎయిమ్స్ వైద్యశాలకు జనం రాకపోకలు పెరగటంతో సర్వీసులు పెంచామన్నారు. ఫిర్యాదుల మేరకు సరిగ్గా లేని 150 మంది చోదకులు, 145 మంది కండక్టర్లను గుర్తించామని, వీరికి అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసులను తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

రైతుబజార్లలో తగ్గింపు ధరలకు వంట నూనెలు

కలెక్టరేట్(గుంటూరు): రైతుబజార్లతోపాటు బండ్లబజారులోని హోల్‌సేల్ వంట నూనెల దుకాణంలో తగ్గింపు ధరకు వంట నూనెలు విక్రయిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో నూనెల ధర కేజీకి రూ.12 నుంచి రూ.16 వరకు పెరిగిందన్నారు. ఆయిల్ మిల్లర్ల సంఘంతో సమావేశమై చర్చించామని, రైతుబజార్లలో రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.120, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.130 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు.

దారి మళ్లించి దోపిడీ

ఇసుక అమ్మేస్తున్న దళారులు

ఈనాడు – అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విధానాన్ని తీసుకొచ్చి ఇసుక తవ్వకం, రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తోంది. ఇసుక డంపింగ్‌యార్డుల్లో టన్ను రూ.250కు విక్రయించి రవాణా ఛార్జీలు కూడా ప్రభుత్వమే నిర్ణయించి వినియోగదారులకు తక్కువ ధరకే సరఫరా చేస్తోంది. అయితే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడంలో మధ్యవర్తుల జోక్యం పెరిగిపోయింది. వీరు సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తున్నారు. దీంతో నల్లబజారులో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇసుక బుకింగ్, రవాణాకు లారీల ఎంపికలోనూ సాంకేతిక అంశాలను అనుకూలంగా మార్చుకున్న కొందరు దళారులు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాళ్లాయపాలెం, అచ్చంపేట మండలంలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది.



దూరం గుర్తించడంలో ఇబ్బందులు

తాళ్లాయపాలెం ఇసుక రీచ్ నుంచి గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఇసుక సరఫరా అవుతోంది. బుక్ చేసుకున్న తర్వాత ప్రభుత్వం ఎంపిక చేసిన లారీల ద్వారా రవాణాకు వెసులుబాటు కల్పించారు. కిలోమీటర్ల వారీగా ప్రభుత్వమే ధరలు నిర్ణయించింది. ఇసుక బుకింగ్ అయిన తర్వాత లారీ యజమానులు తాము రవాణా చేస్తామని యాప్‌లో ఆమోదం తెలపాల్సి ఉంటుంది. తాళ్లాయపాలెం నుంచి వినియోగదారులు కోరిన ప్రాంతానికి దూరాన్ని యాప్ ద్వారానే నిర్ణయిస్తారు. ఇందులో వివిధ కారణాలతో దూరం తగ్గించి నమోదు కావడంతో లారీ యజమానులు ఆసక్తి చూపడం లేదు. ఉదాహరణకు తాళ్లాయపాలెం నుంచి నున్నకు 15.8 కి.మీ, సూర్యారావుపేటకు 15.87 కి.మీ, సింగ్‌నగర్‌కు 19.78 కి.మీ చూపుతోంది. మంగళగిరి సమీపంలోని జాతీయ రహదారి నుంచి లారీలు వెళ్లే మార్గంలో తాళ్లాయపాలెం డంపింగ్‌యార్డుకు 20 కిలోమీటర్లకుపైగా దూరం వస్తోంది.

దోచేస్తున్నారు ఇలా..

ఇసుక బుక్ చేసుకున్న దళారులు మాయోపాయం చేస్తున్నారు. బుకింగ్ చేసిన ప్రాంతంలో కాకుండా.. వారు ఎవరికైతే అమ్మారో అక్కడ అన్‌లోడ్ చేయిస్తున్నారు. ఇదేంటని డ్రైవరు అడిగితే.. కుంటిసాకులు చెబుతున్నారు. యాప్‌లో బుక్ చేసిన ప్రాంతంలో ఇసుక అన్‌లోడ్ చేస్తే లారీ యజమానికి ఓటీపీ వస్తుంది. అది నమోదు చేస్తేనే రవాణా ఛార్జీలు యజమాని ఖాతాకు జమవుతాయి. గుంటూరు నగరానికి 20 టన్నుల ఇసుక లారీ రవాణా ఛార్జీలతో కలిపి రూ.11,900కు వస్తోంది. దీనిని దళారులు రూ. 25 వేలకు అమ్ముతున్నారు. తెనాలికి రూ. 13 వేలకు లారీ ఇసుక వస్తుండగా రూ.30వేలకు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకునే సమయంలో చిరునామా, విస్తీర్ణం, జియో ట్యాగింగ్ చిత్రాలు ఏది నమోదు చేసినా ఆమోదిస్తుండటంతో దళారులు సులభంగా లబ్ధి పొందుతున్నారు.

అక్రమార్కులపై చర్యలు

తాళ్లాయపాలెం ఇసుక డంపింగ్‌యార్డులో మాత్రమే నిల్వలు ఉండటంతో రోజుకు 2వేల టన్నుల చొప్పున సరఫరా చేస్తున్నాం. దళారులు ఇసుక బుక్ చేసుకుని అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నాం. యాప్‌లో దూరం నిర్ణయించడంలో దగ్గరి దారి తీసుకోవడంతో కొన్ని సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అక్టోబరు 15 తర్వాత కొత్త రీచ్‌లు అందుబాటులోకి వచ్చాక డిమాండ్ మేరకు సరఫరా చేస్తాం.

– భార్గవ్ తేజ, సంయుక్త పాలనాధికారి, గుంటూరు

మద్యం దుకాణాలకు... తెలంగాణ వ్యాపారుల పోటీ

గుంటూరు జోన్‌లో 4,579 దరఖాస్తులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరులోని మద్యం దుకాణాల కోసం తెలంగాణ రాష్ట్రంలోని వ్యాపారులు పోటీ పడడం చర్చనీయాంశమైంది. లైసెన్సుల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్‌తోపాటు పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తులు అందించే ఏర్పాట్లు చేసింది. ఇంతవరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంపై చర్చ నడుస్తోంది. కొంత మంది రాజకీయ నాయకులు తమ అనుచరులకు దుకాణాలు దక్కాలనే ఉద్దేశంతో ఇతరులు దరఖాస్తు చేయకుండా అడ్డుకుంటూ బెదరిస్తున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో ఈ పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడొద్దని ఇటీవల సీఎం చంద్రబాబు హెచ్చరించారు. అయినా కొంతమంది రహస్యంగా తమ వ్యూహాలు అమలు చేస్తున్నారు. మరోవైపు తెలంగాణా రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ఆన్‌లైన్‌లో గుంటూరు జోన్ పరిధిలోని దుకాణాలకు దరఖాస్తులు దాఖలు చేశారు.


దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

★ దరఖాస్తుల దాఖలుకు ఎవరి ఒత్తిళ్లకూ లొంగాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని ఎక్సైజ్ గుంటూరు జోన్ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు బుధవారం రాత్రి చెప్పారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.
★ గుంటూరు జోన్‌లో పరిధిలో బుధవారం రాత్రికి 4,579 దరఖాస్తులొచ్చాయి. గుంటూరు జిల్లాలోని 127 దుకాణాలకు 2,874 మంది దరఖాస్తు చేశారు.

14న మద్యం దుకాణాలకు లాటరీ


శ్రీనివాసులు డీసీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలను ఈ నెల 14వ తేదీన వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఆ శాఖ గుంటూరు జోన్ ఉపకమిషనర్ (డీసీ) డాక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. 16వ తేదీ నుంచి కొత్త లైసెన్సుదారులు దుకాణాలు ప్రారంభించుకోవచ్చని తెలిపారు.

మంగళగిరి నలుమూలలా... నిఘా కళ్లు!

- పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో భద్రత మరింత కట్టుదిట్టం
- మరో 500 కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదన


తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

రాజధాని అమరావతికి ముఖద్వారమైన తాడేపల్లి - మంగళగిరి నగరపాలక సంస్థతోపాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత దిశగా పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 300 నిఘా కెమెరాలున్నాయి. వీటికి అదనంగా మరో 500 కెమెరాలను అమర్చేందుకు పోలీసు అధికారులు ప్రతిపాదించనున్నారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో భద్రత కోసం పైలెట్ ప్రాజెక్టుగా మంగళగిరి సబ్ డివిజన్‌ను ఎంపిక చేశారు. తెదేపా కూటమి అధికారంలోకొచ్చాక రాజధాని అమరావతికి రాకపోకలు పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా మంత్రులు, ఉన్నతాధికారులు నగర పరిధిలోనే నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని గతంలోనే మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. మరోవైపు అపరిచిత వ్యక్తులను గుర్తించడం.. ఇక్కడికి ఎవరెవరు వస్తున్నారో గుర్తించే అంశంపైనా పోలీసు శాఖ దృష్టి పెట్టింది. సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి పట్టణం, గ్రామీణ మండలం, తాడేపల్లి, పెదకాకాని, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిఘా పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇటీవల పోలీసు అధికారులతోపాటు నగరపాలక అధికారులు సంయుక్తంగా కసరత్తు చేశారు.

> ముఖ గుర్తింపు కెమెరాలు, రహదారులపై ప్రమాదాలకు పాల్పడి తప్పించుకుని వెళ్లేవారి వాహనాల నంబర్లను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు.

★ ముఖ్యమైన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలు, ప్రముఖ ఆలయాలు, ప్రజాప్రతినిధుల నివాసాలున్న చోట కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

★ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తారు.


మంగళగిరి పట్టణం

జాతీయ రహదారిపై నిఘా ఏదీ?

చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారిపై తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి నుంచి గుంటూరు వరకు నిఘా లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు వెలుగులోకి రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలతో ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోతున్న ఘటనలూ ఉంటున్నాయి. పోలీసులు వీటిని గుర్తించలేకపోతున్నారు. కొన్ని ఘటనల్లో ఆధారాలూ లభ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలోనే జాతీయ రహదారిపై నిఘా కెమెరాలు అమర్చాలన్న నిర్ణయానికి వచ్చారు.

వృత్యంతర శిక్షణ.. ఉద్యోగానికి బాసట

నిబద్ధతతో చేస్తేనే ప్రయోజనం ✪ ఇంజినీరింగ్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి

రాజేంద్రనగర్(గుంటూరు), న్యూస్‌టుడే

అకడమిక్ పరీక్షల్లో ఎంత ప్రతిభ చూపినప్పటికీ నూతన విద్యావిధానం ప్రకారం యంత్ర విద్య విద్యార్థులకు వృత్యంతర శిక్షణ(ఇంటర్న్‌షిప్) తప్పనిసరి. ఉన్నత విద్యామండలి నిబంధనల ప్రకారం ఈ శిక్షణ పూర్తి చేసిన వారికి మాత్రమే ఇంజినీరింగ్ పట్టా లభిస్తుంది. దీనివల్ల పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు సంపాదించవచ్చు.



మౌఖిక పరీక్షకు హాజరైన విద్యార్థులు

వీటిని పూర్తి చేస్తేనే..

ఆలిండియా సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) నిబంధనలు అనుసరించి ప్రతి విద్యార్థి అకడమిక్ పరీక్షలతో పాటు వృత్యంతర శిక్షణ చేయాల్సిందే. 4వ సెమిస్టర్ తర్వాత 4 వారాలు, 6వ సెమిస్టర్ అనంతరం 4 వారాల ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. 8వ సెమిస్టర్‌లో భాగంగా మూడు నెలల ఇంటర్న్‌షిప్‌తో పాటు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ పూర్తి చేస్తేనే డిగ్రీ పొందడానికి అర్హులవుతారు.

విద్యార్థులదే బాధ్యత

ఈ ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేయాల్సిన బాధ్యత పూర్తిగా విద్యార్థులపై ఉంది. సంబంధిత పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి. కొన్ని బహుళజాతి సంస్థలు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవకాశం ఇస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు పొందే నైపుణ్యాలు ప్రాంగణ ఎంపికలతో పాటు, ఉద్యోగ సాధనకు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

అందించేవి ఇవే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సివిల్, మెకానికల్, కెమికల్ కోర్ బ్రాంచులకు చెందిన విద్యార్థులు ఆయా రంగాల కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేస్తారు. ఈసీఈ, ఈఈఈ, కంప్యూటర్, దాని అనుబంధ బ్రాంచుల విద్యార్థులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బహుళజాతి సంస్థలు ప్రాంగణ ఎంపికల్లో విజేతలకే ఇంటర్న్‌షిప్‌లు ఇస్తాయి. అవి కూడా ప్రీమియర్ విద్యాసంస్థలకు మాత్రమే. ఉన్నత విద్యామండలి సిఫార్సు చేసిన సంస్థలతోపాటు ఎడ్యూ స్కిల్స్, ఈడీయూ స్కిల్స్ తదితర సంస్థలు, ఆలిండియా రేడియో, ఎన్‌టీసీఈ, దూరదర్శిని వంటి సంస్థల్లో అవకాశం ఉంటుంది. కొన్ని ఆన్‌లైన్‌లో అందిస్తున్నాయి.

లాభాలు ఇవీ

వృత్యంతర శిక్షణ వల్ల పరిశ్రమలతో అనుసంధానం పెరుగుతుంది. ప్రయోగ నైపుణ్యంపై అవగాహన ఏర్పడుతుంది. పరిశ్రమల్లోని వ్యక్తులతో పరిచయం ఏర్పడడంతో అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. నైపుణ్య సాధనపై ఉన్న ఆసక్తితో కంపెనీ గుర్తింపు పొందితే ఉద్యోగం సైతం దక్కొచ్చు.

కళాశాలల వివరాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న 42 ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు నరసరావుపేట జేఎన్‌టీయూ, ఏఎన్‌యూ, 5 ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లోని సుమారుగా 16 వేల మంది ఈ వృత్యంతర శిక్షణకు వెళ్తున్నారు.

నిబద్ధతే కీలకం



వృత్యంతర శిక్షణతో విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని పొందవచ్చు. దానివల్ల మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. శిక్షణతో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు సంపాదించవచ్చు. ఆయా సంస్థలు ఇచ్చే ధ్రువపత్రాలకు ప్రాధాన్యం ఉంటుంది. వృత్యంతర శిక్షణను నిబద్ధతతో చేయాలి.

– ఆచార్య పి.ఎల్.మాధవరావు, ఉపాధి కల్పనాధికారి, కేహెచ్ఐటీ, చౌడవరం



అడ్వాన్స్‌డ్ ఐసీయూలో పని చేయని ఫ్యాన్లు



ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న రోగులకు సపర్యలు

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి

జీజీహెచ్‌లోని ఏఎంసీ అత్యవసర రోగుల అడ్వాన్స్‌డ్ ఐసీయూ విభాగాల్లో ఏసీలు, ఫ్యాన్లు పని చేయడం లేదు. ఓ పక్క ఉక్కపోత తట్టుకోలేకపోతుంటే.. మరోపక్క లోపల ఉన్నవారికి గాలి తగలక అల్లాడిపోతున్నారు. ఏఎంసీలో అయితే అసలేమీ పని చేయడం లేదు. అడ్వాన్స్‌డ్ ఐసీయూలో కొన్ని మూలనపడ్డాయి. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ఈ విభాగాల్లో కిటికీలన్నీ మూసేసి ఉంటాయి. శీతల యంత్రాలు కాసేపు పని చేయకపోతే ఉండలేము. అలాంటిది రోజుల తరబడి రోగులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వారి బంధువులు విసనకర్రలతో సపర్యలు చేయాల్సి వస్తోంది. జీజీహెచ్ అధికారులు వెంటనే స్పందించి ఏసీలు, ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

– ఈనాడు – గుంటూరు, న్యూస్‌టుడే – నగరంపాలెం.



ఏఎంసీలో ఏసీలు పని చేయకపోవడంతో రోగికి విసనకర్రతో విసురుతున్న బంధువు

'కడప జిల్లా పేరు వైఎస్ఆర్‌గా మార్చటం చారిత్రక తప్పిదం'

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: చారిత్రక నేపథ్యం ఉన్న వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కడప జిల్లాకు వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చటం చారిత్రక తప్పిదమన్నారు. వైఎస్ మరణానంతరం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎలాంటి చర్చ జరగకుండా తీసుకున్న ఈ నిర్ణయంతో తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా, కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేర్కొన్న విధంగా వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని కోరారు. ఇకపై కట్టడాలు, ప్రాజెక్టులు, పథకాలకు జీవించి ఉన్నవారి పేర్లు కాకుండా.. అమరులైన మహనీయుల పేర్లు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్తు చౌర్యం.. రూ.13.80 లక్షల అపరాధ రుసుం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడే వారితో పాటు అదనపు లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా ఒకేసారి 58 బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. గుంటూరులోని డి-8 సెక్షన్ పరిధిలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 277 మందికి నోటీసులు జారీ చేసి రూ. 13.80 లక్షల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో అనుమతించిన లోడ్ కన్నా ఎక్కువగా విద్యుత్తును వినియోగిస్తున్నవారే అధికంగా ఉన్నారన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటేశ్వరరావు, ఈఈ శ్రీనివాస బాబు, డిప్యూటీ ఈఈలు ఎం.రవికుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడే వారి వివరాలను 94408 12263, 94408 12360 నంబర్లకు ఫోన్ చేసి తెలపాల్సిందిగా కోరారు.

రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రస్థానంలో నిలబెడతాం

మంగళగిరి, న్యూస్‌టుడే : రానున్న ఐదేళ్లలో ఏపీని క్రీడల్లో అగ్రస్థానంలో నిలబెడతామని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. మంత్రి నారా లోకేశ్ సహకారంతో 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరుతో నాలుగు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన బుధవారం రాత్రి ప్రారంభించారు. ఆటలను ప్రోత్సహిస్తూ యువతలో ఉత్తేజాన్ని నింపుతున్న మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో అంతర్జాతీయ క్రీడలను నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంకల్పంతో ఉన్నారన్నారు. యువతకు గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఐదేళ్లు క్రీడారంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో కలిసి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు

రైతులకు ఉత్తమ సేవలే లక్ష్యం

పెదనందిపాడు, న్యూస్‌టుడే : రైతులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా సహకార బ్యాంకులు ముందుకెళ్తున్నాయని జేసీ భార్గవ్ తేజ అన్నారు. బుధవారం పెదనందిపాడులో సహకార బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు అందించే సేవలను కర్షకులు వినియోగించుకోవాలని సూచించారు. సహకార బ్యాంకుల్లో ఆన్‌లైను బ్యాంకింగ్ పద్ధతి అమలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 18 ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో అవకతవకలు జరిగాయని విచారణ జరుగుతోందని, బాధ్యులపై కేసులు కూడా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జీడీసీసీ బ్యాంకు సీఈవో టి.కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో రైతులకు రూ.2,100 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.687 కోట్లు పంపిణీ జరిగిందన్నారు. స్థానిక సహకార పరపతి సంఘంలో రుణాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని కొందరు రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా పెండింగ్‌లో ఉన్న వారికి వారం రోజుల్లో రుణాలు పంపిణీ చేస్తారన్నారు. రాష్ట్ర సహకార బ్యాంకు ఎండీ శ్రీనాథ్ రెడ్డి, నాబార్డు డీడీఎం శరత్ బాబు, డీజీఎం బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.



సహకార బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న జేసీ భార్గవ్ తేజ

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టులో చోటు



వాసవి అఖిల పావని

మంగళగిరి, న్యూస్‌టుడే : బరోడా వేదికగా ఈ నెల 17 నుంచి జరిగే ఇండియా సీనియర్ మహిళా టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఏపీ మహిళా క్రికెట్ జట్టులో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావనిని సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. గత నెల ఒకటో తేదీ నుంచి ఐదు వరకు దిల్లీలో జరిగిన దిల్లీ క్యాపిటల్స్ ఉమెన్ ఐపీఎల్ టీమ్ సెలక్షన్ ట్రైల్స్‌కి అఖిల పావని హాజరయ్యారు. ఈ జట్టులో 15 మంది క్రీడాకారులుండగా స్టాండ్‌బైగా మరో ఏడుగురిని ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 11వ తేదీ నాటికి విజయనగరం నార్త్ జోన్ అకాడమిలో హాజరు కావాలని ఏసీఏ కార్యదర్శి సతీష్‌బాబు సూచించారు.

తెనాలిలో 20.6 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు సగటున 2.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అధికంగా తెనాలి మండలంలో 20.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. వట్టిచెరుకూరు 14.4, చేబ్రోలు 3.2, దుగ్గిరాల 2.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

20 నుంచి ఏఎన్‌యూలో కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జేసీ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. ఈ మేరకు ఏఎన్‌యూలో అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఈ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో కశ్మీర్‌లోని ఆరు జిల్లాల నుంచి 132 మంది యువత పాల్గొంటున్నారన్నారు. సమీక్షలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, డీపీవో బి.వి.ఎన్.సాయికుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ సస్పెన్షన్

పట్నంబజారు, న్యూస్‌టుడే: కేసు దర్యాప్తులో అలసత్వం ప్రదర్శించిన పాతగుంటూరు ఎస్ఐ భాగ్యరాజ్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. బుడంపాడుకు చెందిన ఒక రైతుకు, పాత గుంటూరుకు చెందిన మరో రైతుకు కొద్దిరోజులుగా పొలం విషయమై ఘర్షణలు జరుగుతున్నాయి. పాత గుంటూరుకు చెందిన రైతు, బుడంపాడుకు చెందిన రైతు తనపై దాడి చేశాడని పాత గుంటూరు పోలీసుల్ని ఆశ్రయించాడు. ఈ కేసును పాతగుంటూరు ఎస్ఐ భాగ్యరాజు దర్యాప్తు చేస్తున్నారు. బుడంపాడుకు చెందిన రైతు ఈ కేసు దర్యాప్తు విషయమై తనకు అన్యాయం జరిగిందని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేయించగా ఎస్ఐ భాగ్యరాజ్ ఈ కేసులో అలసత్వం ప్రదర్శించారని రుజువైంది.

భాజపా నాయకుడికి సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు తనకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని భాజపా మాజీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిపై ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు వ్యక్తులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇరకాటంలో పెడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం తాను వేరే రాష్ట్రంలో ఉండటం వల్ల పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయానని, త్వరలో తెనాలి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

బ్రాయిలర్ ధరలు



(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

మేడికొండూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడమే ప్రధాన ధ్యేయమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఒక కల్యాణ మండపంలో బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు ఫిర్యాదిదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో మొత్తం 275 అర్జీలు వచ్చాయి. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా నియామకం


అలీం బాషా

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక ప్రత్యేకాధికారిగా అలీం బాషా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ప్రత్యేకాధికారిగా కొనసాగిన జిల్లా జాయింట్ కలెక్టర్(రెవెన్యూ) పదవీకాలం ఈ నెల 2వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో నగరపాలక కమిషనర్ అలీం బాషాకు ప్రత్యేకాధికారి బాధ్యతలను అప్పగిస్తూ మున్సిపల్ పరిపాలనా విభాగం ఉత్తర్వులిచ్చింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధమవుదాం


మాట్లాడుతున్న పార్టీ ప్రతినిధి, పక్కన శ్రీఅనిత

దుగ్గిరాల, న్యూస్‌టుడే : గుంటూరు-కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం సిద్ధం కావాలని తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత అన్నారు. బుధవారం దుగ్గిరాలలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె చర్చించారు. 2020-21 కన్నా ముందు డిగ్రీ పూర్తి చేసిన వారందరి పేర్లు ఓటర్లుగా చేర్చాలని చెప్పారు. దరఖాస్తు ఎలా పూర్తి చేయాలో పార్టీ ప్రతినిధి వివరించారు. ఆన్‌లైనులో దరఖాస్తు చేసేటప్పుడు డిగ్రీ ధ్రువపత్రం, ఫొటో స్కానింగ్ చేసి పెట్టాలని తెలిపారు. భాజపా మండల అధ్యక్షుడు పసుపులేటి గణేష్, కాబోతు దేవదాసు, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ పర్యటన నేడు

తాడేపల్లి: మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ గురువారం పర్యటించనున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకు ఉండవల్లి కూడలిలోని అయోధ్య ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మంగళగిరి రైల్వేస్టేషన్ రోడ్డులోని అఖిలాండేశ్వరి దేవి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి గౌతమ బుద్ధ రోడ్డులోని కాళీమాత ఆలయాన్ని సందర్శిస్తారు. రాత్రి 7 గంటలకు పాత మంగళగిరి బజార్ పానకాల వద్ద ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మను దర్శించుకుంటారు. అక్కడ నుంచి రత్నాల చెరువు, చినకాకాని రామాలయం కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో పూజలు నిర్వహిస్తారని తెదేపా కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది.

ఏం కొనలేం.. తినలేం..!

మండుతున్న కూరగాయల ధరలు ★ కిలో రూ.60కి తక్కువ ఏమి లేవు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలు, భారీ వరదలకు కూరగాయ పంటలకు జరిగిన నష్టం కారణంగా మార్కెట్‌లో వాటి ధరలు భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలకు కూరగాయల సాగునకు ఆటంకం ఏర్పడింది. దీంతో కొన్ని రకాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవలసిన వస్తుందని దీంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. తీగజాతి రకాలు దొండ, బీర, దొస, సొర వంటివి కృష్ణాతీరంలో ఎక్కువగా పండుతున్నాయి. వీటిలో ప్రస్తుతం దొండ మాత్రమే లభిస్తోంది.



మార్కెట్‌లో ధరలు ఇలా...	
కూరగాయ రకం	కిలో (రూ.లలో..)
టమాట	90
వంకాయలు	60
పచ్చిమిర్చి	40
కాకర	60
బీర	80
క్యారెట్	80
దొండ	60
చిక్కుడు	90
బంగాళదుంప	60
చేమదుంప	55
ఉల్లి	60
వెల్లుల్లి	420

భారంగా మారింది

కూరగాయలంటే ముందుగా గుర్తొచ్చేది టమాట. వాటి ధర పెరగడంతో సామాన్యులు కొనే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో కిలో రూ.35 ఉండేది నేడు రూ.80 నుంచి 90 వరకు పలుకుతోంది. ఫలితంగా వినియోగదారులకు భారంగా మారింది. రైతు బజారులో సైతం విపణిలో ఉన్న ధరలకు సమాంతరంగా ఉండటంతో ఎక్కడా కొనలేకున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

ఉల్లి, వెల్లుల్లి వల్ల కన్నీళ్లే

విపణిలో ఉల్లి, వెల్లుల్లి కొనాలంటే వినియోగదారులకు కన్నీళ్లొస్తున్నాయి. రూ.20 ఉండే ఉల్లిపాయ నేడు రూ.60 పలుకుతోంది. కర్నూలు, సోలాపూర్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ నుంచి ఉల్లి అధికంగా దిగుమతి అవుతోంది. దీంతో ధరలు పెరిగాయి. ఇలాంటి సమయాల్లో జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకొని ప్రత్యేక కౌంటరు ఏర్పాట్లు చేసి వాటిని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. వెల్లుల్లి కిలో రూ.320 ఉండేది. నేడు దాని ధర రూ.420కి పెరిగింది. అవీ నాసిరకమైనవే ఉంటున్నాయి.

అందుబాటులో లేక అవస్థలు

కూరగాయల ధరలను నియంత్రించి విక్రయించే రైతు బజారును మంగళగిరి శివారులో ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులు అక్కడ దాకా వెళ్లి కొనుగోలు చేయలేకపోతున్నారు. ప్రైవేటు దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో చేసేది లేక అందుబాటులో ఉన్న వాటిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతుబజారు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. జన సంచారం ఎక్కువగా ఉండే తాడేపల్లిలో బైపాస్ రోడ్డు, ఉండవల్లి కూడలి, మంగళగిరిలో ప్రధాన వీధితో పాటు వడ్లపూడి సెంటర్, పాత మంగళగిరి, గౌతమ బుద్ధా రోడ్డు తదితర ప్రాంతాల్లో రైతుబజార్లు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి

తాడేపల్లిలో రైతు బజారు లేదు. ఫలితంగా కూరగాయల ధరలు అదుపులో ఉండటం లేదు. ప్రైవేటు దుకాణాల్లో ఇష్టాను రీతిగా ధరలు పెంచి అమ్ముతున్నారు. దీనివల్ల మా లాంటి మధ్య తరగతి వర్గాలు కొనలేకపోతున్నాం. ఇక్కడ రైతుబజారు ఏర్పాటు చేసి తక్కువ రేటుకు అందరికీ అందుబాటులో తీసుకురావాలి. ధరలు నియంత్రించాలి.

-రత్నకుమారి, ఉండవల్లి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ప్రసంగిస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

పెదనందిపాడు, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధికి ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కలిసి కట్టుగా పని చేయాలని ఎంపీడీవో శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలని కోరారు. శుద్ధమైన తాగునీరు సరఫరా చేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో స్వామిరెడ్డి, శిక్షకుడు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ


గెలుపొందిన వైద్య విద్యార్థులతో విష్ణువర్ధన్‌రావు

చినకాకాని(మంగళగిరి), న్యూస్‌టుడే : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం, నేషనల్ మెడికల్ కౌన్సిల్ సంయుక్తంగా తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో ఈ నెల 2 నుంచి 6 వరకు పీజీ వైద్య విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఇందులో చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల విద్యార్థులు మూడోస్థానం సాధించినట్లు పీడీ గురునాథం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులందరికీ ఎన్నారై అకాడమి ఆఫ్ సైన్సెస్ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతిగా అందించారు.

వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖ విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగం, గుంటూరు జిల్లా పర్యవేక్షక విభాగం ఎస్.ఈ పి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండలంలోని లింగాయపాలెం, రాయపూడి, శాఖమూరు, వెలగపూడి పరిధిలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యుత్తు చౌర్యం, అక్రమ కనెక్షన్లు, అధిక లోడు, కేటగిరిలు తదితర కేసులకు మొత్తం 6.60 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో 123 మంది సిబ్బంది 41 బృందాలుగా ఏర్పడి 2,979 సర్వీసులను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క వినియోగదారుడు విద్యుత్తు మీటరు సీలు సరిగా ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్తు చౌర్యాలపై 9440812263కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి మండలం చిర్రావూరులో గురువారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు లైన్లు మరమ్మతులు కారణంగా సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. కాగా మంగళగిరి పరిధిలోని కొత్తపేట, మెయిన్ బజార్, వడ్లపూడి సెంటర్, గౌతమ బుద్ధా రోడ్డు తూర్పు భాగం, ఎల్‌బీనగర్, ఇస్లాంపేట, పాత మంగళగిరి, గండాలయపేటలో సరఫరాకి అంతరాయం కలుగుతుందన్నారు. మంగళగిరి మండలం నూతక్కి, రామచంద్రపాలెం, చినకాకాని, కాజ, వెంకటరెడ్డిపాలెం గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాలలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని సీపీఎం నాయకులు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోరారు. గ్రామ నూతన కార్యదర్శిగా ఎన్.యోగేశ్వరరావును ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు, జెట్టి బాలరాజు, పోతురాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం నిర్వహణపై అభ్యంతరం


మహిళలతో మాట్లాడుతున్న ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి ఎన్టీఆర్ కట్ట నుంచి సుందరయ్య నగర్‌కు వెళ్లే మార్గంలో పంట పొలాల మధ్య వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులను కలసి వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా బుధవారం విచారణ జరిపారు. అక్కడ పరిస్థితులపై మహిళల నుంచి వివరాలు సేకరించారు.

13 దుకాణాలకు 254 దరఖాస్తులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 13 ప్రైవేటు మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియకు 254 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ వై.అశోక్ కుమార్ చెప్పారు. ప్రత్తిపాడు- 4, వట్టిచెరుకూరు- 3, పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు మండలంలో- 6 మద్యం దుకాణాలు ఉన్నాయి. బుధవారం చివరి రోజు అని భావించిన పెద్ద సంఖ్యలో పలువురు దరఖాస్తులు చేశారు. ఈ నెల 11 వరకు గడువును ప్రభుత్వం పొడిగించిన నేపథ్యంలో ఇంకా దరఖాస్తులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణి


మంగళగిరి: కాళిమాత ఆలయంలో..


తాడేపల్లిలో..


నూతక్కి: అక్షరాభ్యాసం చేస్తూ..


ప్రత్తిపాడు: సరస్వతీ పూజలో చిన్నారి


అమీనాబాద్‌లో..


పెదనందిపాడులో..


పాలపర్రులో..


ప్రత్తిపాడులో...

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. మూలా నక్షత్రం కావడంతో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. -న్యూస్‌టుడే, బృందం


దుగ్గిరాల చెన్నకేశవనగర్‌లో..


తుళ్లూరు : అనంతవరంలో...


లాలుపురంలో..


పలకలూరు విజ్ఞాన్ విద్యా సంస్థలో..


అబ్బినేనిగుంటపాలెంలో..


సామూహిక పూజలకు తరలివస్తున్న మహిళలు

చేతి పంపులకు మరమ్మతులు



చాలా కాలం చుక్కనీరు రాకుండా మూలపడిన చేతి పంపులు ప్రాణం పోసుకుంటున్నాయి. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నీటి సమస్య పరిష్కారానికి గతంలో బోర్లు వేసి పంపులు బిగించారు. కానీ వీటి నిర్వహణను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో అవి తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. ఈ సమస్యను నగరపాలక అధికారులు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి వాటికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది వాటిని బాగు చేసే పనిలో ఉన్నారు.

- న్యూస్‌టుడే, మంగళగిరి, తాడేపల్లి

చిరు వ్యాపారులకు చేయూత


తోపుడు బండి అందజేస్తున్న తెదేపా నాయకులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : తుళ్లూరుకు చెందిన పలువురు చిరు వ్యాపారులకు తెదేపా మాజీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ 12 తోపుడు బండ్లను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోయేలా పేదలకు సాయమందించాలని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన పిలుపు మేరకు వీటిని అందించినట్లు కిరణ్ తెలిపారు. జమ్ముల అనిల్, బండ్ల పట్టాభిరామయ్య, కాటా అప్పారావు, సురేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఫిరంగిపురం తహసీల్దారుగా జజ్జర ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలలుగా డిప్యూటీ తహసీల్దారు రాజారమేష్ ఇన్‌ఛార్జి తహసీల్దారుగా పని చేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే : మేడికొండూరు డిప్యూటీ తహసీల్దారుగా భువనేశ్వరీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన శ్రీనివాసరావు బదిలీపై సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. పొన్నూరు సీఎస్‌డీటీగా పని చేస్తున్న భువనేశ్వరీ బదిలీపై ఇక్కడకు వచ్చారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఫిరంగిపురం, న్యూస్‌టుడే : రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రేపూడి గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి మందులు అందించారు. తిప్పారెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి, శివరామ్ రెడ్డి, చిట్టా శ్రీనివాస రెడ్డి, పున్నారెడ్డి, హనుమత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

మేడికొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఫిరంగిపురానికి చెందిన ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై పొదుపు సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీవో చందన, సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణకు చర్యలు

ఫిరంగిపురం గ్రామీణం: మండలంలోని శిరంగిపాలెం, తక్కెళ్లపాడులో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకురాలు శివకుమారి మాట్లాడుతూ పత్తి, మిరప, వరిలో సస్య రక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు.

నీటిశుద్ధి కేంద్రం ఉన్నా ప్రయోజనం శూన్యం

బూడిదలో పోసిన పన్నీరులా ప్రభుత్వ నిధులు


తాళం వేసి ఉన్న ఐరా సురక్షిత మంచినీటి పథకం

మండలంలోని ముట్లూరు గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించేందుకు నిర్దేశించిన ముట్లూరు ఐరా సురక్షిత రక్షిత తాగునీటి పథకం నిరవధికంగా నిలిచిపోయింది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.7.5 లక్షలు అందించింది. దీనికి తోడు పంచాయతీ తన వంతుగా రూ.2 లక్షలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత మూడేళ్లుగా నీటి ఉత్పత్తి ఆగిపోయింది. దాంతో గ్రామంలో ఏడు వరకు శుద్ధజల కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో ఈ పథకం మూతబడింది. దీనివల్ల రూ.10 లక్షలకు పైగా ప్రజాధనం వృథా అవుతోంది. పాలకులు, అధికారులు దీనిపై చర్యలు తీసుకుని గ్రామస్థులకు పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. -ముట్లూరు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే

రోడ్డు ప్రమాదంలో కాపలాదారు దుర్మరణం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నల్లపాడు ఎస్వీ కాలనీకి చెందిన గుర్రాల మరియదాసు(60) బహుళ అంతస్తుల భవనంలో కాపలాదారునిగా పని చేస్తుంటారు. ఈ నేపథ్యంలో తన ద్విచక్ర వాహనంపై అంకిరెడ్డిపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా చల్లావారిపాలెం సాయిబాబా ఆలయ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపైన పడిపోయారు. అదే సమయంలో వేగంగా వస్తున్న కారు అతని మీదుగా దూసుకెళ్లగా మరియదాసు అక్కడికక్కడే మృతి చెందారు. నల్లపాడు పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నకిలీ ప్లాటు రిజిస్ట్రేషన్‌పై కేసు

తాడికొండ, న్యూస్‌టుడే : నకిలీ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై తాడికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వున్నవ శ్రీనివాసరావు గుంటూరు పట్టాభిపురానికి చెందిన కొల్ల శరత్‌చంద్ర అనే వ్యక్తి వద్ద నుంచి రూ.20 లక్షల నగదు తీసుకున్నాడు. లాం గ్రామంలో సర్వే నం: 277-ఎలో ప్లాటు నం: 238, 239 ప్లాట్లు ఉన్నాయని నకిలీ రిజిస్ట్రేషన్ చేశాడు. తర్వాత అది నకిలీదని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు తాడికొండ సీఐ వాసు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయం మేలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే పంటకు చీడపీడలు అంతగా ఆశించవని ఏవో సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాడు, కట్రపాడు గ్రామాల్లో పంట పొలాలను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే పైరులను సంరక్షించుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ అనుబంధ పథకాల గురించి రైతులకు వివరించారు.

13న మేరీమాత మందిరం వార్షికోత్సవం

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మేరికపూడిలో ఈ నెల 13న మేరీమాత మందిరం వార్షికోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఉదయం 10.30 గంటలకు దివ్య పూజాబలి కార్యక్రమం ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం భారీ అన్నదానం కలదు. విచారణ గురువు ప్రభుకుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

బీహెచ్ఈఎల్‌కు రెండు ఇంద్ర సర్వీసులు



తెనాలి డిపోకు వచ్చిన కొత్త బస్సులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి డిపోకు బుధవారం ఆరు కొత్త బస్సులు చేరాయి. వాటిల్లో రెండు ఇంద్ర బస్సులను హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు, రెండు బస్సులను పుల్లలచెరువుకు, విజయవాడ, చెరుకుపల్లి మార్గాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పొన్నూరు, న్యూస్‌టుడే: మండల పరిధి ములుకుదురులోని జీబీసీ రహదారిలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు దట్టంగా అల్లుకుపోయాయి. ప్రమాదం పొంచి ఉందని ఈ నెల 8వ తేదీన 'ఈనాడు'లో 'నిర్లక్ష్యం అల్లుకుంది' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖాధికారులు అక్కడి మొక్కలను తొలగింపజేశారు.

ఈనాడు కథనానికి స్పందన



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ నాజరుపేట సింగ్ నగర్ ఇస్కాన్ ఆలయ సమీపంలో వీధి దీపాలు 15 రోజుల నుంచి వెలగడం లేదు. చీకటి వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు, నాజరుపేట**

✔ సత్వరం వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం.

- బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్, - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పట్టణ పరిధి భావనగర్ కాలనీలో మూడు రోజులు నుంచి చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వ్యాపిస్తోంది. **-ఎస్. లతదేవి, భావనగర్‌కాలనీ.**

✔ చెత్తను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటా.

శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి. -పొన్నూరు న్యూస్‌టుడే

గ్రామాల ప్రగతికి పట్టం

పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, న్యూస్‌టుడే

ఈ నెల 14 నుంచి 21 వరకు 'పల్లె పండుగ'
అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని గత వైకాపా పాలనలో పల్లె ప్రగతి కుంటుపడింది. కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులను గత పాలకులు పక్కదారి పట్టించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి స్తంభించింది. చేపట్టిన పనులకు సవ్యంగా బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. అయిదు సంవత్సరాల వైకాపా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.

మండలాలు	సీసీ రహదారులు (రూ.లక్షల్లో)	సీసీ డ్రెయిన్లు (రూ.లక్షల్లో)
పొన్నూరు	77	23
చేబ్రోలు	79	11
పెదకాకాని	65	35

సమస్యల నుంచి ఊరట..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పల్లె పాలనపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఆగస్టు 23వ తేదీన నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించారు. ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు రూపొందించారు. గ్రామాల్లో సిమెంటు రహదారులు, సిమెంటు మురుగు కాలువ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించారు. నియోజకవర్గ పరిధిలోని సిమెంటు రహదారులకు రూ. 2.21 కోట్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.69 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ నిర్వహించమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనుల ప్రక్రియ పూర్తయితే ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుంది.



మాచవరంలో ఆధునికీకరణకు ప్రతిపాదించిన రోడ్డు

వ్యర్థాలను జిందాల్ పరిశ్రమకు తరలించండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలను గుంటూరు నాయుడుపేటలోని జిందాల్ పరిశ్రమకు తరలించాలని గుంటూరు మున్సిపల్ ఆర్డీ హరికృష్ణ కమిషనర్ శేషన్నకు సూచించారు. ఆయన బుధవారం బుర్రిపాలెంరోడ్డులోని కంపోస్ట్ యార్డును పరిశీలించారు. అలాగే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధి కుక్కలను గుర్తించి సంతాన నిరోధక శస్త్రచికిత్స చేయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన శస్త్రచికిత్స కేంద్రం షెడ్డు, పేరుకుపోయిన వ్యర్థాలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల నుంచి పీచు తయారీ పరికరాన్ని పరిశీలించారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్డీ హరికృష్ణ

దూర విద్య విధానంలో సైన్సు కోర్సులకు అనుమతి


ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: దూర విద్యా విధానంలో పలు సైన్సు కోర్సుల నిర్వహణకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సీడీఈకి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో(డెబ్) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వర్సిటీ వర్గాలకు సమాచారం అందించింది. ఇందుకు వీసీ ఆచార్య గంగాధర్ విశేష కృషి చేశారు. వీటిలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, సైకాలజీ, గణంకాలు, గణితం, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ తదితర కోర్సులు ఉన్నాయి. వీటిలో చేరాలనుకునేవారు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు తెలిపారు. వీసీ మాట్లాడుతూ సీడీఈలో సైన్స్ కోర్సుల నిర్వహణకు అనుమతులు రావడం సంతోషకరమన్నారు.



యూజీసీ డెబ్ నుంచి వచ్చిన అనుమతి లేఖను వీసీ గంగాధర్‌కు అందజేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొన్నూరు అర్బన్ సీఐ రవి కిరణ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి పొన్నూరు జీబీసీ రహదారిలోని ప్రైవేటు భవనంలో వారధి కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం కోరినా ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి నగదు పోగొట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ సీఐ రవికిరణ్

రూ. 133 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

కొల్లిపర, న్యూస్‌టుడే: వరద ముంపు సమయంలో ప్రభుత్వం బాసటగా నిలిచిందని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డి అన్నారు. బుధవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.33 కోట్ల నిధులు కేటాయించామన్నారు. మండల పరిషత్ రూ.ఐదు లక్షల నిధులతో వల్లభాపురంలో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. వరద ముంపులో నష్టపోయిన 2401 మంది రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందించిందని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీటీసీ సభ్యుడు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సందడిగా నాటకోత్సవాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ స్థాయి నాలుగో పద్య, సాంఘిక నాటకాలు, నాటికల పోటీలు మూడోరోజు బుధవారం తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో సందడిగా సాగాయి. గంగోత్రి పెదకాకాని వారి 'అష్టమ పసుపు', విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారి స్వేచ్ఛ నాటకాలు, పూర్ణోదయ ఆర్ట్స్ చీరాల వారి 'నేనేం చేసుకుంటాను', రసఝరి పొన్నూరు బృందం 'గురి తప్పిన వేట' నాటికలలో నటీనటుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని కళాకా ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



గురితప్పిన వేట నాటికలోని సన్నివేశం

ఆర్టీసీకి పూర్వ వైభవం తెస్తాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఆర్టీసీ పూర్వ వైభవానికి కట్టుబడి ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోలో బుధవారం ఆయన ఆరు కొత్త బస్సులను ప్రారంభించారు. వీటిలో హైదరాబాద్, విజయవాడ, ఇతర గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన సర్వీసులు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లు బాగోలేని ప్రాంతాల్లోనూ ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థతోపాటు అన్ని విభాగాలను నిర్వీర్యం చేసిందన్నారు. గుంటూరు బస్టాండ్ వద్ద రోడ్ల మరమ్మతులు జరగాల్సి ఉందని, అదే విధంగా గతంలో మాట ఇచ్చినట్లు తెనాలి మండలం పెదరావూరు నుంచి మంగళగిరి హైవే వరకు నాలుగు వరుసల రోడ్డును కచ్చితంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ పనులు పూర్తయితే తెనాలి నుంచి విజయవాడకు చాలా తక్కువ సమయంలో చేరుకోవచ్చన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి తెనాలి డిపో నుంచి ప్రతి రోజూ 100 బస్సులు తిరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీపీటీవో రవికాంత్, డిపో మేనేజర్ రాజశేఖర్, సీఎస్ఐ శ్యామ్‌బాబు, డీఈ వీవీఎల్ రావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బస్టాండ్ ఆవరణలో నూతనంగా వేసిన రోడ్డును కూడా మనోహర్ ప్రారంభించారు.



బస్సులు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులు

20న అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలులోని పాత రెడ్డిపాలెంలో ఈ నెల 20వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హాజరవుతారన్నారు. ఈ మేరకు బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు.

బాధ్యతల స్వీకరణ

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారిగా డి.వెంకట రఘురాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పురపాలక సంఘ కమిషనర్ ముప్పాళ్ళ రమేషుబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో ఆయన పల్నాడు అభివృద్ధి ప్రాధికార సంస్థలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పొన్నూరు వచ్చారు.

వీరికి ప్రభుత్వం మారలేదేమో..!

మండల పరిధి మాచవరం గ్రామ పంచాయతీలోని నూతనంగా నిర్మించిన సచివాలయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రపటంతో కూడిన నవరత్నాల లోగో ఇంకా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి వంద రోజులు దాటినా దీన్ని తొలగించకపోవడంపై స్థానికులు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పొన్నూరు**



ముగిసిన రక్షణ సువార్త సభలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ సుల్తానాబాద్‌లో మంగళవారం ప్రారంభం అయిన రక్షణ సువార్త సభలు బుధవారంతో ముగిశాయి. దైవజనులు ప్రకాష్‌రాజ్, అబ్రహం సందేశాలను అందించారు. తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బ్రదర్ ఆనందన్న, దానియేలురాజు, రత్నరాజు, సంఘ పెద్దలు సుధాకర్, ఆదాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు.



ఆరాధనలో పాస్టర్లు

దాండియా... బతుకమ్మ సంబరాలు

పొన్నూరు, న్యూస్‌టుడే: శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం విజ్ఞాన్ యూనివర్శిటీలో దాండియా, బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు

అగ్గి తెగులుపై అప్రమత్తత అవసరం

పెదకాకాని, న్యూస్‌టుడే : ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో అగ్గి తెగులు వ్యాపించే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా ట్రైసైక్లోజల్ మందును ఎకరానికి 120 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏవో సంధ్యారాణి తెలిపారు. తంగెళ్లమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులతో మాట్లాడారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: వరి పైరు చిరు పొట్ట దశలో ఉందని అధిక దిగుబడులు సాధించేందుకు ఎకరాకు 20 కిలోల నుంచి 25 కిలోల వరకు పొటాష్‌ను తప్పని సరిగా వేయాలని పొన్నూరు వ్యవసాయశాఖాధికారి డేగల వెంకట రామయ్య పేర్కొన్నారు, బుధవారం మండల పరిధిలోని మాచవరం, ములుకుదురు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం పెదరావూరులో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత పర్యటించి వరిలో చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ పర్యవేక్షించారు.



తంగెళ్లమూడిలో వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో సంధ్యారాణి, రైతులు

జ్ఞాన తేజం.. విశ్వరూపం



గంగానమ్మపేటలో వెన్నపూసతో సరస్వతి దేవి



బోసురోడ్డు వాసవీ ఆలయంలో..



వాసవీ మాత ప్రాంగణంలో మహాగౌరీదేవి



పొన్నూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ..



పొన్నూరులో కనక దుర్గా భవానీ...



అలంకారంలో అమ్మవారు

తెనాలి(కొత్తపేట), తెనాలి టౌన్, చేబ్రోలు, పొన్నూరు, కొల్లిపర, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఏడో రోజు బుధవారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో కోవెలలు భక్తుల కోలాహలంతో మురిశాయి. సరస్వతిదేవి, మహాగౌరీదేవి, విద్యాలక్ష్మీదేవి అలంకారాలలో అమ్మ దర్శనమిచ్చారు. ఆయా చోట్ల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకుల వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెనాలి గంగానమ్మ పేటలో వెన్నపూసతో తయారు చేసిన సరస్వతీ రూపం ఆకట్టుకుంది.



తెనాలి టౌన్: నందివెలుగులోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి మనోహర్



పొన్నూరులో మహిళల కుంకుమపూజ

చదువుల తల్లీ నమోస్తుతే..

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం భ్రమరాంబ అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో గోగినేని లీలాకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం సుప్రభాత సేవ, హారతులు, కుంకుమార్చనలు, పంచహారతులు తదితర పూజలు నిర్వహించారు. రాత్రి భక్తిరంజని, వీణా వాయిద్యం, కూచిపూడి నృత్యం, సత్యహరిశ్చంద్ర నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. ఏఎన్‌యూ ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యాలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. **- కొల్లిపర, న్యూస్‌టుడే**



పెదకాకానిలో సరస్వతీ దేవిగా..

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: జిల్లా, డివిజన్ స్థాయి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నాకే నూతన ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు ప్రారంభించాలని తెనాలి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ పేర్కొన్నారు. ఆమె బుధవారం పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం సలహా సంఘ సమావేశంలో మాట్లాడారు. అలాగే నిబంధనల ప్రకారం రెన్యువల్ కూడా చేయించాలని ఆమె సూచించారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని ఆమె చెప్పారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ వివరాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ వైద్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ నాజరుపేటలోని ఒక ఇంటిలో బుధవారం జూదం ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ పోలీసులు వారి వద్ద నుంచి రూ. 27,300 స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా బుర్రిపాలెం రోడ్డులోని ఒక ఇంటిలో జూదం ఆడుతున్న నలుగురిని పట్టుకున్న రెండో పట్టణ పోలీసులు వారి వద్ద నుంచి రూ. 4,700 స్వాధీనం చేసుకున్నారు.

వంతెనలు... ప్రమాద ఘంటికలు

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి, మురుగు నీటి కాల్వలపై ఎప్పుడో నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకముందే వాటిని ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు. - చేబ్రోలు, న్యూస్‌టుడే



★ గరువుపాలెం వద్ద అప్పాపురం కాలువపై ఏర్పాటు చేసిన వంతెనపై మట్టి లారీల రాకపోకలతో గుంతలు పడ్డాయి. గుంతలు కనపడకుండా మట్టితో కప్పివేశారు. మిగ్‌జాం తుపాను సమయంలో వంతెన పటిష్ఠతను పరిశీలించిన కలెక్టర్ వాహనాల రాకపోకలను నిషేధించారు. ప్రస్తుతం కాలవ పక్కగా ఇరిగేషన్ శాఖ స్థలంలో తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసుకున్నారు. ఈ వంతెనను పునర్నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



★ శేకూరు రోడ్డులో నల్ల డ్రెయిన్‌పై ఉన్న వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇరువైపులా ఉన్న గోడ కొంత మేర కూలిపోయి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



★ వడ్లమూడి నుంచి అడ్డరోడ్డు వెళ్లే దారిలో అప్పాపురం కాలువపై నిర్మించిన వారధి గోడలు దెబ్బతిన్నాయి. ఇరువైపులా ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు మాయం కావడంతో రాత్రి వేళ ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.



★ గుంటూరు తెనాలి రహదారిలో నారా కోడూరులో పైపులైను నిర్మాణం కోసం మురుగు కాల్వపై ఉన్న వంతెన గోడ తొలగించారు. మళ్లీ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల వేజండ్ల గ్రామానికి చెందిన సుభాని అనే ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి కాల్వలో పడి పోయాడు.

గుంటూరు తూర్పు

ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంటు పరిశీలన


వ్యర్థాల నిర్వహణ పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్టడీ టూర్‌లో భాగంగా కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒడిశాలోని బాసుఫై నగరపాలకసంస్థలో ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంటును పరిశీలించారు. పర్యటన వివరాలను ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆ ప్రాంతంలోని అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రం, వ్యర్థాల శుద్ధి కేంద్రాల పనితీరుని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు, వ్యర్థాల నుంచి ఇతర ఉత్పత్తుల తయారీ ప్లాంటు, వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ యూనిట్లను పరిశీలించిన కమిషనర్ బృందం ప్లాంటు నిర్వహణకు అయ్యే ఖర్చులు, కార్మికులు, యంత్రాల సామర్థ్యం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనధికార దుకాణాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన


గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైతుబజారులో వినియోగదారుల రాకపోకలకు అడ్డుగా ఉన్న అనధికార దుకాణాలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. రైతు బజారు ప్రాంగణంలో నిల్వ ఉన్న వ్యర్థాలను తీసివేయించారు. ఈ నెల 6న రైతు బజారులో 'సమస్యల తిష్ఠ' అనే శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ మార్కెటింగ్ సంచాలకులు రాజాబాబు మంగళవారం ఉదయం రైతుబజారును పరిశీలించి వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతుబజారులో దుకాణాల మధ్యలో ఉన్న వ్యర్థాల గుట్టలను తీసివేయించారు. రాకపోకలకు అడ్డుగా దారిలో ఉన్న దుకాణాలను తొలగించేశారు. వాహనాలు నిర్దేశిత ప్రాంతంలో పార్కింగ్ చేయించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

వ్యాపారవర్గాల ఉన్నతికి కృషి


ఆంజనేయులును సత్కరిస్తున్న ప్రతినిధులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: వ్యాపార వర్గాల ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని ఛాంబర్ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు అన్నారు. ఆయన ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చెన్నై ఈసీ నంబరుగా, ఏపీ ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఈసీ నంబరుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం జిన్నాటవర్ సెంటర్‌లోని కార్యాలయంలో పలువురు వ్యాపారులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఉపాధ్యక్షులు టీఎల్‌వీ వీరాంజనేయులు, వి.వి.నాగిరెడ్డి, ఎ. నగేష్, కొప్పురావూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న వేద సీడ్స్ ఎండీ చంద్రశేఖర్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కుంచనపల్లి గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అందించారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం వైద్య ఖర్చులకు సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పకుండా శిరస్త్రాణం ధరించాలన్నారు. ఈనెల 3న కాజా టోల్‌గేటు వద్ద శ్రీనివాసరావుకు ప్రమాదం జరిగిందని, మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేద సీడ్స్ హెచ్‌ఆర్ జీఎం తోట రంగారావు, ప్రొడక్షన్ జీఎం గుడి సతీస్‌కుమార్, పీఆర్వో ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 50, వంగ 24, బెండ 24, పచ్చిమిర్చి 19, కాకర 25, క్యారెట్ 43, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 24, బీర 28, దొండ 44, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 37, గోరుచిక్కుళ్లు 34, దోస 32, పొట్ల 34, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 66, చామదుంప 38, మునగ 8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 29, కీర 34, క్యాప్సికం 64, అల్లం 68, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7.

– న్యూస్‌టుడే, పట్నంబజారు

కుళాయిల్లో అవినీతి ధార!

పెచ్చుమీరుతున్న అక్రమ కనెక్షన్లు

కార్పొరేషన్ ఆదాయానికి ఇంజినీరింగ్ అధికారుల గండి

★ శ్యామలనగర్‌కు చెందిన ప్రసాదరావు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు రుసుములన్నీ చెల్లించినా కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నిస్తే.. రూ.50,000 డిమాండ్ చేశారు.

★ కృష్ణనగర్‌కు చెందిన నాగేశ్వరరావు అపార్ట్‌మెంట్‌కు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అందుకోసం ఆస్తి పన్ను వేయమని ఆరు నెలలుగా మొత్తుకుంటుంటే అతీగతీ లేదు. చివరకు శానిటరీ సర్టిఫికెట్ కోసం కూడా డబ్బు డిమాండ్ చేశారు. తెలిసిన వారితో సిఫార్సు చేసుకుంటే తప్ప సమస్య కొలిక్కి రాలేదు. ఎట్టకేలకు దరఖాస్తు చేసుకోగలిగారు. కనెక్షన్ ఇచ్చేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందో చూడాలంటున్నారు.

నగరపాలక సంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే

ప్రజలకు తాగునీటిని అందించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత. మార్గదర్శకాల మేరకు రోజు వారీ ప్రతి వ్యక్తికి 135 లీటర్ల శుద్ధజలం ఇవ్వాలి. దీనికిగాను జీఎంసీ నెలవారీగా రూ.60 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. జీఎంసీకి వసూలవుతున్న పన్నుల ఆదాయంలో సగం తాగునీటి సరఫరాకే పోతోంది. క్షేత్రస్థాయిలో అనధికార, అక్రమ కుళాయి కనెక్షన్లు పెరిగిపోవడం, వాణిజ్య సంస్థలకు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా వదిలేశారు. అనధికార కుళాయి కనెక్షన్ల నుంచి అధికారులు జేబులు నింపుకుంటూ జీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఆర్థిక స్థోమత చూసి.. మరీ గుంజుడు..

జీఎంసీకి కట్టాల్సిన ఫీజులు చెల్లించకుండానే కొందరు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చి యజమానుల ఆర్థిక స్థోమతను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లకు దిగుతున్నారు. వీటి మెటీరియల్‌ను కూడా యజమానుల నుంచే తెప్పించి నీటి ధార తగ్గకుండా వచ్చేలా వాల్‌పిన్ అమర్చుతున్నారు. అడిగిన కాడికి డబ్బులివ్వని వారికి మోటార్లు వేసినా తాగునీరు రాని విధంగా ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు పడలేక అడిగినంత ఇచ్చుకుని కనెక్షన్ సరి చేయించుకుంటున్నారు. ఇలా క్షేత్ర స్థాయిలో అవినీతి అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుండటంతో వార్డు సచివాలయం మౌలిక సదుపాయాల కార్యదర్శులు కూడా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

వివరాలు ఇవీ..

మొత్తం అసెస్‌మెంట్లు	: 2,15,298
నివాసాలు	: 2,42,822
కుళాయి కనెక్షన్లు	: 1,54,825
గృహ వినియోగం	: 1,50,857
వాణిజ్య కనెక్షన్లు (మీటర్)	: 3,968


వాణిజ్య కుళాయికి బిగించిన మీటర్


పైపులైనుపై గృహ కుళాయి కనెక్షన్

వాణిజ్య ప్రాంతాల్లో ఎక్కువ అక్రమాలు..

నగరంలో వాణిజ్య ప్రాంతాల్లో హోటల్స్, అల్పాహార దుకాణాలు, రెస్టారెంట్లు ఉండే చోట్ల అక్రమ కనెక్షన్లు ఇచ్చి అందిన కాడికి దండుకుంటున్నారు. బృందావన్‌గార్డెన్స్ నుంచి రింగురోడ్డు వెళ్లే దారిలో రెండు రెస్టారెంట్లు, హోటళ్లకు అనధికారికంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి ఇంజినీరింగ్ సిబ్బంది మామూళ్లు దండుకుంటున్నారని విమర్శలున్నాయి. వెల్‌కం హోటల్ ఎదురుగా ఉండే అల్పాహార స్టాళ్లకు, మొదటి ఫేజ్‌లో ఒక ఆసుపత్రి భవనానికి అనధికారికంగా కుళాయి కనెక్షన్ ఇచ్చినట్లు ఫిర్యాదులున్నాయి. రెడ్డిపాలెం వద్ద ఆంజనేయ కాలనీలో పదుల సంఖ్యలో ఇచ్చి ప్రతి కుటుంబం నుంచి రూ.వేలలోనే వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. రింగురోడ్డులోని ప్రగతినగర్‌లోనూ ఇదే పరిస్థితి. ఇటీవలే పట్టాభిపురంలోని ఓ బహుళ అంతస్తుల భవనానికి వర్క్ ఆర్డర్ లేకుండా కనెక్షన్ ఇచ్చారు. నగరంలో ఆరు వేలకుపైగా అపార్ట్‌మెంట్లు ఉండగా.. కొన్నిటికి మాత్రమే మీటర్లు ఉన్నాయి. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సులున్న అసెస్‌మెంట్లు 20 వేల వరకు ఉండగా.. మీటర్ కనెక్షన్లు మాత్రం 3,968 ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు కూడా గృహ కుళాయిలుగా పరిగణిస్తుండడంతో జీఎంసీకి భారీగా నష్టం వాటిల్లుతోంది. వీటన్నింటిని క్రమబద్ధీకరిస్తే మీటర్ కుళాయి కనెక్షన్లు భారీగా పెరిగే అవకాశముంది. ఈమేరకు నగరపాలక ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి వార్డు సచివాలయాల వారీగా సర్వే నిర్వహించి తాగునీటి కుళాయిలను క్రమబద్ధీకరించాల్సి ఉంది.


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

కూటమి అభ్యర్థిదే గెలుపు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. బుధవారం రాష్ట్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేయండి

నెహ్రూనగర్: గ్రామ వార్డు వాలంటీర్లకు రూ.10 వేల వేతనంతోపాట ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏపీ రాష్ట్ర వాలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. క్యాబినెట్ సమావేశంలో వాలంటీర్ల గురించి చర్చించి శుభవార్త తెలియజేయాలన్నారు. కరోనా సమయంలో చేసిన సేవలకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లా కన్వీనర్ రాజేష్, వెంకటరెడ్డి, వజిత్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఎంహెచ్‌వో


మనోహర్‌నాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ రవిబాబు

నగరపాలక సంస్థ: నగరపాలకసంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడును నూతన ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు సంపత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం

పట్నంబజారు, న్యూస్‌టుడే: కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యర్థాల్ని సక్రంగా తొలగించడంలేదు. మార్కెట్‌లో 50కు పైగా దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో మిగిలిన కూరగాయల వ్యర్థాల్ని మార్కెట్ ముందు భాగంలో పడేస్తుంటారు. శానిటరీ సిబ్బంది వాటిని ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దీంతో మార్కెట్‌లోని సిబ్బంది వ్యర్థాలను కాల్చివేస్తున్నారు. వచ్చే పొగతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌పై పెద్ద మొత్తాల్లో ఆసీలు వసూలు అవుతున్నా.. అధికారులు వ్యర్థాల్ని తొలగించకపోవడం ఏంటని పలువురు కూరగాయల వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరస్వతీ.. నమోస్తుతే


తమ్మారంగారెడ్డినగర్ ఆలయంలో చండీహోమాలు..


పాత గుంటూరులోని కొత్తరాములవారిగుడిలో...


రెడ్లబజారులోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..


రెడ్లబజారులోని అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే నసీర్..


కొత్తపేట శివాలయం


ఎన్టీఆర్ నగర్‌లో..


చేనేత కాలనీలో..


ఏటుకూరురోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో...


వినోభనగర్: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు..

నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం అమ్మవారికి సరస్వతి అలంకరణ చేసి, చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ పలు ప్రాంతాల్లో అమ్మవారి దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వేద పండితులు చండీహోమం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయాలను విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు.

– పట్నంబజారు, నెహ్రూనగర్, న్యూస్‌టుడే


లాంచెస్టర్‌రోడ్డులోని అమ్మవారి దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు


జెండాచెట్టువీధిలో..


బుచ్చయ్యతోటలో సరస్వతీదేవికి పూజలు


మంగళదాస్‌నగర్‌లో..


బావనారుషి ఆలయంలో..


చినమహాలక్ష్మమ్మ ఆలయంలో..


మోతీలాల్‌నగర్‌లో విద్యార్థులు


సీతానగర్‌లో..


గణపతి హోమం

రాగిపాత్రకు మహిమలున్నాయంటూ మోసాలు

ముగ్గురి అరెస్ట్, రూ.25లక్షల నగదు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్-రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తమ వద్ద ఉన్న పురాతన రాగిపాత్రకు అద్భుత మహిమలున్నాయంటూ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25లక్షల నగదు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాలు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన శివసంతోష్, చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన జి.మంజునాథ్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన ప్రతాప్ ముఠాగా ఏర్పడి రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు. తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10 కోట్లు లాభపడినట్టు మంజునాథ్‌రెడ్డి అతడికి వివరించాడు. దాన్ని కొనేందుకు చాలామంది పోటీపడుతున్నారని తన పలుకుబడితో సొంతమయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజుల తరువాత శశికాంత్‌కు ఎస్‌డీరోడ్‌లోని ఓ హోటల్‌లో శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగిపాత్ర శక్తిని తెలుసుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను రంగంలోకి దింపి పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేందుకు అడ్వాన్స్‌గా ఈనెల 6న రూ.25లక్షలు తీసుకున్నారు. శశికాంత్ రాగిపాత్ర గురించి అడిగితే మరో రూ.25లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40 లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10లక్షలు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. విజయవాడ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్దఎత్తున బాధితులున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ ముఠా పురాతన రాగిపాత్రలో మహిమలున్నాయంటూ అందులో రసాయనం ఉంచి బియ్యం పోసేవారు. కొంత సమయానికి అవి పచ్చరంగులోకి మారటంతో తేలికగా నమ్మేవారు.

తవ్వారు.. వదిలేశారు



ఏటుకూరురోడ్డులోని బస్టాండు సెంటర్‌లో ఇటీవల పైపు లైన్ల నిర్మాణం కోసం గుంతలు తవ్వి వదిలివేశారు. ఈ ప్రాంతానికి బుడంపాడు, నారాకోడూరు, లాలుపురం తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. రాత్రి వేళల్లో చీకటిలో రోడ్డుపై ఉన్న గుంత కనిపించక పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక వ్యాపారులు గుంత చుట్టు చెట్ల మొక్కలతో ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇటీవల కార్పొరేషన్‌లోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని స్థానిక వ్యాపారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, పట్నంబజారు

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆ శాఖలోని అధికారులు, సిబ్బందిని కలచివేసింది. గుంటూరుకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ **చావల శ్రీనివాసరావు (53)** చిలకలూరిపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అతనికి బుధవారం ఉదయం గుండెపోటు వచ్చింది. వెంటనే సిబ్బంది ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆ శాఖ ఉప కమిషనర్ శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారి, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్పు కోటయ్య, పీసీ విల్సన్ గుంటూరు కోబాల్డుపేటలోని నివాసంలో చావల శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: అప్పుల బాధ తట్టుకోలేక మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రగతి నగర్‌లో చోటుచేసుకుంది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన ఒర్సు పార్వతి (43) మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం చుట్టు పక్కల వారి వద్ద రూ.7లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పార్వతి ఈ నెల 6వ తేదీన ఎలుకల నివారణ మందు తినగా.. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాలు అపహరించే దొంగను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సీఐ వీరనాయక్ నిందితుని వివరాలను వెల్లడించారు. పలకలూరురోడ్డు రత్నగిరినగర్‌కు చెందిన వెలుగోలు వెంకటేష్ చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించటానికి చోరీలకు అలవాటు పడ్డాడు. ఈ నెల 5వ తేదీన ఐటీసీ పార్కు వద్ద నిలిపిన వాహనం చోరీకి గురైందనే ఫిర్యాదుపై కేసు నమోదైంది. ఈ క్రమంలో బుధవారం నిందితుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద మూడు ద్విచక్రవాహనాలు జప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్టీని బలోపేతం చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావనగార్డెన్స్‌లోని వైకాపా జిల్లా కార్యాలయంలో బుధవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్‌పై విషం కక్కుతుందన్నారు. లడ్డూ వివాదంలో కూటమి నాయకులు తప్పుడు ప్రచారాలు ఆపాలని హితవు పలికారు. త్వరలో జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి సమావేశం అవుతారన్నారు. సమావేశంలో గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నూరి ఫాతిమా, నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు వైద్యం: జాతీయ ఆరోగ్య మిషన్ గుంటూరు విభాగంలో ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటరీ అటెండర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. వివరాలు www.guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

గుంటూరు పశ్చిమ

ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంటు పరిశీలన


వ్యర్థాల నిర్వహణ పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్టడీ టూర్‌లో భాగంగా కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒడిశాలోని బాసుపై నగరపాలకసంస్థలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంటును పరిశీలించారు. పర్యటన వివరాలను ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆ ప్రాంతంలోని అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రం, వ్యర్థాల శుద్ధి కేంద్రాల పనితీరుని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు, వ్యర్థాల నుంచి ఇతర ఉత్పత్తుల తయారీ ప్లాంటు, వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ యూనిట్లను పరిశీలించిన కమిషనర్ బృందం ప్లాంటు నిర్వహణకు అయ్యే ఖర్చులు, కార్మికులు, యంత్రాల సామర్థ్యం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వల్లో పూడికతీత: బ్రాడీపేటలోని 14, 19 వీధుల్లోని కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించారు.

చెత్త తొలగింపు: డీఎస్ నగర్, ఆర్.అగ్రహారంలోని పలు వీధుల్లో చెత్త పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అడపా వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి చెత్తను తొలగింపజేశారు.

-న్యూస్‌టుడే, బ్రాడీపేట

ఉద్యోగాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు వైద్యం: జాతీయ ఆరోగ్య మిషన్ గుంటూరు విభాగంలో ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటరీ అటెండర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. వివరాలు www.guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

కేంద్ర పథకాల పరిశీలనకు జాతీయ స్థాయి బృందం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ద్వారా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి సాధారణ పర్యవేక్షణకు జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం బుధవారం జిల్లాకు వచ్చింది. ఈ మేరకు బృంద సభ్యులు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి ఆయా పథకాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ నెల 16వ తేదీ వరకు జిల్లాలోని మేడికొండూరు, పెదకాకాని, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లోని 10 గ్రామ పంచాయతీల్లో ఈ బృందం పథకాల అమలును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు ప్రిన్సిపల్ ప్రోగ్రాం సమన్వయకర్త సూర్యకాంత ప్రధాన్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అశోక్‌కుమార్ సాహూ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ నాగలక్ష్మితో జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం

ఓటర్ల జాబితా వెల్లడి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి వెల్లడించారు. జీజీహెచ్‌తో పాటు, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో వీటిని అందుబాటులో ఉంచారు. ఈనెల 14న ఎన్నికల ప్రకటన విడుదల చేస్తారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన అనంతరం తుది జాబితాను ప్రకటిస్తారు. 18న ఉపసంహరణకు సాయంత్రం 5 గంటల వరకు గడువు ఇచ్చారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. ఎన్నికలు అవసరమైతే 23న జీజీహెచ్‌లో నిర్వహించి అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు.

కుళాయిల్లో అవినీతి ధార!

పెచ్చుమీరుతున్న అక్రమ కనెక్షన్లు

కార్పొరేషన్ ఆదాయానికి ఇంజినీరింగ్ అధికారుల గండి

★ **శ్యామలనగర్‌కు చెందిన ప్రసాదరావు** కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు రుసుములన్నీ చెల్లించినా కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నిస్తే.. రూ.50,000 డిమాండ్ చేశారు.

★ **కృష్ణనగర్‌కు చెందిన నాగేశ్వరరావు** అపార్ట్‌మెంట్‌కు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అందుకోసం ఆస్తి పన్ను వేయమని ఆరు నెలలుగా మొత్తుకుంటుంటే అతీగతీ లేదు. చివరకు శానిటరీ సర్టిఫికెట్ కోసం కూడా డబ్బు డిమాండ్ చేశారు. తెలిసిన వారితో సిఫార్సు చేసుకుంటే తప్ప సమస్య కొలిక్కి రాలేదు. ఎట్టకేలకు దరఖాస్తు చేసుకోగలిగారు. కనెక్షన్ ఇచ్చేందుకు ఇంకెన్నాళ్లు పడుతుందో చూడాలంటున్నారు.

నగరపాలక సంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే

ప్రజలకు తాగునీటిని అందించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత. మార్గదర్శకాల మేరకు రోజు వారీ ప్రతి వ్యక్తికి 135 లీటర్ల శుద్ధజలం ఇవ్వాలి. దీనికిగాను జీఎంసీ నెలవారీగా రూ.60 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. జీఎంసీకి వసూలవుతున్న పన్నుల ఆదాయంలో సగం తాగునీటి సరఫరాకే పోతోంది. క్షేత్రస్థాయిలో అనధికార, అక్రమ కుళాయి కనెక్షన్లు పెరిగిపోవడం, వాణిజ్య సంస్థలకు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా వదిలేశారు. అనధికార కుళాయి కనెక్షన్ల నుంచి అధికారులు జేబులు నింపుకుంటూ జీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఆర్థిక స్థోమత చూసి.. మరీ గుంజుడు..

జీఎంసీకి కట్టాల్సిన ఫీజులు చెల్లించకుండానే కొందరు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చి యజమానుల ఆర్థిక స్థోమతను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లకు దిగుతున్నారు. వీటి మెటీరియల్‌ను కూడా యజమానుల నుంచే తెప్పించి నీటి ధార తగ్గకుండా వచ్చేలా వాల్‌పిన్ అమర్చుతున్నారు. అడిగిన కాడికి డబ్బులివ్వని వారికి మోటార్లు వేసినా తాగునీరు రాని విధంగా ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు పడలేక అడిగినంత ఇచ్చుకుని కనెక్షన్ సరి చేయించుకుంటున్నారు. ఇలా క్షేత్ర స్థాయిలో అవినీతి అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుండటంతో వార్డు సచివాలయం మౌలిక సదుపాయాల కార్యదర్శులు కూడా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

వివరాలు ఇవీ..

మొత్తం అసెస్‌మెంట్లు	: 2,15,298
నివాసాలు	: 2,42,822
కుళాయి కనెక్షన్లు	: 1,54,825
గృహ వినియోగం	: 1,50,857
వాణిజ్య కనెక్షన్లు (మీటర్)	: 3,968


వాణిజ్య కుళాయికి బిగించిన మీటర్


పైపులైనుపై గృహ కుళాయి కనెక్షన్

వాణిజ్య ప్రాంతాల్లో ఎక్కువ అక్రమాలు..

నగరంలో వాణిజ్య ప్రాంతాల్లో హోటల్స్, అల్పాహార దుకాణాలు, రెస్టారెంట్లు ఉండే చోట్ల అక్రమ కనెక్షన్లు ఇచ్చి అందిన కాడికి దండుకుంటున్నారు. బృందావన్‌గార్డెన్స్ నుంచి రింగురోడ్డు వెళ్లే దారిలో రెండు రెస్టారెంట్లు, హోటళ్లకు అనధికారికంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి ఇంజినీరింగ్ సిబ్బంది మామూళ్లు దండుకుంటున్నారని విమర్శలున్నాయి. వెల్‌కం హోటల్ ఎదురుగా ఉండే అల్పాహార స్టాళ్లకు, మొదటి ఫేజ్‌లో ఒక ఆసుపత్రి భవనానికి అనధికారికంగా కుళాయి కనెక్షన్ ఇచ్చినట్లు ఫిర్యాదులున్నాయి. రెడ్డిపాలెం వద్ద ఆంజనేయ కాలనీలో పదుల సంఖ్యలో ఇచ్చి ప్రతి కుటుంబం నుంచి రూ.వేలల్లోనే వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. రింగురోడ్డులోని ప్రగతినగర్‌లోనూ ఇదే పరిస్థితి. ఇటీవలే పట్టాభిపురంలోని ఓ బహుళ అంతస్తుల భవనానికి వర్క్ ఆర్డర్ లేకుండా కనెక్షన్ ఇచ్చారు. నగరంలో ఆరు వేలకుపైగా అపార్ట్‌మెంట్లు ఉండగా.. కొన్నిటికి మాత్రమే మీటర్లు ఉన్నాయి. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్సులున్న అసెస్‌మెంట్లు 20 వేల వరకు ఉండగా.. మీటర్ కనెక్షన్లు మాత్రం 3,968 ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు కూడా గృహ కుళాయిలుగా పరిగణిస్తుండడంతో జీఎంసీకి భారీగా నష్టం వాటిల్లుతోంది. వీటన్నింటిని క్రమబద్ధీకరిస్తే మీటర్ కుళాయి కనెక్షన్లు భారీగా పెరిగే అవకాశముంది. ఈమేరకు నగరపాలక ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి వార్డు సచివాలయాల వారీగా సర్వే నిర్వహించి తాగునీటి కుళాయిలను క్రమబద్ధీకరించాల్సి ఉంది.

తనలా... వేరెవరికీ కాకూడదని....



మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దు. ... మీ కుటుంబం కోసం ఆలోచించండంటూ స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నారు గుంటూరు నగరంలోని జన్మభూమి కాలనీకి చెందిన అచ్చియ్య. ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలంటూ హితవు పలుకుతున్నారు. గతంలో రహదారి ప్రమాదానికి గురై ప్రాణాపాయం నుంచి బయటపడ్డాను, మిగిలినవారికెవరికీ అలా జరగకూడదని, ఇబ్బంది పడకూడదని ప్రచారం చేస్తున్నానని చెప్పారు. ప్లకార్డులు చేతపట్టుకుని అవగాహన కలిగిస్తున్నారు.

- ఈనాడు, గుంటూరు

శ్రీసాయి మహాద్వారం ప్రారంభోత్సవం నేడు



గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యానగర్ మూడోలైను ప్రారంభంలో శ్రీసాయినాథ సన్నిధానం, రింగురోడ్డు కూడలిలో సర్వాంగ సుందరంగా నిర్మించిన శ్రీసాయి మహాద్వారం కలశ ప్రతిష్ఠ, ప్రారంభోత్సవం గురువారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి ఆశోక్‌కుమార్, అధ్యక్షుడు పడమటి శివరామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, దాతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో ఆమె సచివాలయాల సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'సచివాలయ సిబ్బందితో పాటు అర్జీలు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. ఈ పటం స్వయంగా తనకే ఎదురైందంటే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతోంది. 29వ డివిజన్‌కు తాను వచ్చిన గంట తర్వాత కూడా సిబ్బంది రాకపోవడం నిర్లక్ష్యం కాదా? ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే ఉపేక్షించేది లేదు. ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే అధికారులదే బాధ్యత. కొందరు అధికారులు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి'.. అని ఎమ్మెల్యే మాధవి సూచించారు.

దివ్యాంగ క్రీడాకారులకు ఆర్థిక సాయం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన దివ్యాంగ క్రీడాకారులు చేబ్రోలు, సుబ్బా జ్యులకు ఎమ్మెల్యే గళ్లా మాధవి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అక్టోబర్ 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ టీ-20 జట్టుకు ఎంపికయ్యారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందున ఆర్థిక సాయం కోసం ఎమ్మెల్యేని ఆశ్రయించారు. దీంతో ఆమె సాయం అందజేశారు.

వీణాపాణీ వందనం


హంసవాహినిగా శారదా పరమేశ్వరి


విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో..


కృష్ణనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..


అరండల్‌పేట అష్టలక్ష్మి ఆలయంలో..


మారుతీ దేవాలయ సంఘంలో సరస్వతి పూజల్లో విద్యార్థులు


ఎస్వీఎన్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ దేవిగా..


ఏటీ అగ్రహారంలో చిన్నారుల పూజలు


కొరిటెపాడులోని కోదండ రామాలయంలో..

పట్టాభిపురం, గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుంటూరు పశ్చిమలోని పలు దేవాలయాలు విద్యార్థులతో కిటకిటలాడాయి. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి అమ్మవారి అలంకారాలు తీర్చిదిద్దారు. విద్యార్థులు భక్తి శ్రద్ధలతో సరస్వతీ పూజలు నిర్వహించారు. చదువుల్లో ఏకాగ్రత నిలిపి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఆశీర్వదించాలని మనసారా పూజలు చేశారు. కొన్ని దేవాలయాల్లో అక్షరాభ్యాసాలు జరిగాయి. సంప్రదాయాన్ని అనుసరించి పెద్ద బెల్లాలు, పలకా బలపాలు, రాతపుస్తకాలు, పెన్సిళ్లు, కలాలు పంచిపెట్టారు.


గోరంట్ల, ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: గోరంట్లలోని వేంకటేశ్వర కాలనీలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గోరంట్ల మాజీ సర్పంచి కందుల సుబ్బారావు, శిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవా సంస్థ అధ్యక్షుడు ఓరుగంటి విశ్వనాథం, కార్యదర్శి సమయమంతుల శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పట్టాభిపురం రామలింగేశ్వర స్వామి దేవాలయంలో..


వికాస్‌నగర్‌లోని శిర్డీసాయి మందిరంలో..


గోరంట్ల: జ్ఞాన సరస్వతీ ఆలయంలో


చైతన్యపురి సాయిబాబా ఆలయంలో..


బీఆర్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో


మారుతీ దేవాలయంలో సరస్వతీ దేవికి విద్యార్థుల పూజలు

రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన 'వజ్రాయుధం'


'వజ్రాయుధం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆవంత్స సోమసుందర్ తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా పాత్ర పోషించారని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలులో మూడు ప్రసిద్ధ పుస్తకాల ఆవిష్కరణ సభ బుధవారం రాత్రి జరిగింది. సభలో ఆవంత్స సోమసుందర్ శతజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన, సోమసుందర్ రచించిన వజ్రాయుధం కవితా సంపుటిని పెనుగొండ లక్ష్మీనారాయణ బుధవారం ఆవిష్కరించారు. వజ్రాయుధం కవితా సంపుటి 1949, మేలో వెలువడగా 1950, ఫిబ్రవరిలో మద్రాసు ప్రభుత్వం నిషేధించిందని, తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1956లో ఆ నిషేధాన్ని ఎత్తివేసిందని వివరించారు. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఆ పుస్తకం తెలుగు సాహిత్య చరిత్రలో నిరంతరాయంగా వెలుగొందుతూనే ఉంటుందన్నారు. తెలుగు నవలా సాహిత్యంలో సంచలనం సృష్టించిన డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచన 'మట్టిమనిషి' మరో ముద్రణను గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ వాసిరెడ్డి భవాని ఆవిష్కరించారు. ఈ నవల తెలుగునాట రైతాంగ జీవన స్థితిగతులను ఎంతో మానవీయంగా విశ్లేషించిందన్నారు. వాసిరెడ్డి నారాయణ కథలను కథాప్రపంచ శీర్షికన అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ సంపాదకత్వంలో అరసం జిల్లా శాఖ ప్రచురించింది. ఈ కథా సంపుటిని సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ సిహెచ్.సుశీలమ్మ ఆవిష్కరించారు. తాను పుట్టి పెరిగిన గ్రామీణ జీవన సౌందర్యాన్ని నారాయణ ఈ కథల్లో ప్రతిబింబించారని సుశీల వివరించారు. సభకు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు దర్శి శేషారావు అతిథులను పరిచయం చేశారు. అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి వినోద్‌కుమార్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'వరద సాయంపైనా జగన్ ముఠా అసత్య ప్రచారాలు'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద సాయంపై జగన్ ముఠా చేస్తున్న అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'వరద బాధితులకు ప్రభుత్వం మొత్తం రూ.203 కోట్లు సాయం చేస్తే.. అందులో రూ.534 కోట్లు దోపిడీ జరిగిందని జగన్ ముఠా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజల్ని పక్కదారి పట్టిస్తోంది. ఇటువంటి నీతిమాలిన పనులు చేయడం వైకాపా నేతలకే చెల్లింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు ఎప్పుడైనా బాధితులకు అండగా ఉంటూ సహాయ, సహకారాలు అందజేస్తారే తప్ప వైకాపా నేతల వలే శవాలపై పేలాలు ఏనాడూ ఏరుకోలేదు. జగన్ రూ.కోటి సాయం ప్రకటించి కనీసం రూ.1000 కూడా ఇవ్వలేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేలాది కోట్లు దిగమింగిన జగన్ చివరకు తాడేపల్లి ప్యాలెస్‌లో వ్యక్తిగతంగా వాడుకుంటున్న ఫర్నిచర్ తిరిగి ఇవ్వకపోగా రూపాయి కూడా ప్రభుత్వానికి జమ చేయకుండా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు'.. అని మోహనకృష్ణ మండిపడ్డారు.

నిత్యం బయోమెట్రిక్ హాజరు పరిశీలన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలో బోధనానిపుణుల హాజరు తదితర విషయాలను జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అధికారులు నిత్యం పరిశీలిస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రధానాచార్యులు టీటీకే రెడ్డి సూచించారు. కళాశాలలో బుధవారం వివిధ విభాగాల అధిపతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఐదేళ్లకు ఒకసారి తనిఖీ చేసేవారన్నారు. మారిన నిబంధనల మేర ఎన్ఎంసీ నుంచి ఎవరూ పరిశీలనకు రావడంలేదన్నారు. బయోమెట్రిక్ హాజరును వారు నేరుగా చూసే సదుపాయం ఉందన్నారు. అందువల్ల బోధనానిపుణుల వివరాలు వారి వద్ద ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. మనమే ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించి నిబంధనల మేర మౌలిక వసతులు, బోధనానిపుణులు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు.

వైద్య ఖర్చులకు నగదు సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వేద సీడ్స్ ఎండీ చంద్రశేఖర్

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: కుంచనపల్లి గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అందించారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం వైద్య ఖర్చులకు సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పకుండా శిరస్త్రాణం ధరించాలన్నారు. ఈనెల 3న కాజా టోల్‌గేటు వద్ద శ్రీనివాసరావుకు ప్రమాదం జరిగిందని, మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేద సీడ్స్ హెచ్ఆర్ జీఎం తోట రంగారావు, ప్రొడక్షన్ జీఎం గుడి సతీస్‌కుమార్, పీఆర్వో ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వేదపండితులకు సత్కారాలు


వేదపండితులకు ద్రవ్యఫల వితరణ చేస్తున్న సత్యనారాయణ, లలితాంబ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన గార్డెన్స్ ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో వేదపండిత సత్కార కార్యక్రమం బుధవారం జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది వేదపండితులను సత్కరించారు. ఈసందర్భంగా భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 1960వ సంవత్సరం నుంచి దసరా నవరాత్రుల్లో మూలా నక్షత్ర పర్వదినాన వేద పండితులను ఆహ్వానించి సత్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఘనపాఠులు పాల్గొని వేద స్వస్తి నిర్వహించారు.

వ్యాపార వర్గాల ఉన్నతికి కృషి


ఆతుకూరి ఆంజనేయులును సత్కరిస్తున్న ఛాంబర్ ప్రతినిధులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: వ్యాపారవర్గాల ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని ఛాంబర్ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు అన్నారు. ఆయన ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చెన్నై ఈసీ నంబరుగా, ఏపీ ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఈసీ నంబరుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం జిన్నా టవర్ సెంటర్‌లోని కార్యాలయంలో పలువురు వ్యాపారులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఛాంబర్ ఉపాధ్యక్షులు టీఎల్‌వీ వీరాంజనేయులు, వి.వి.నాగిరెడ్డి, ఆతుకూరి నగేష్, కొప్పురావూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ప్లాటు రిజిస్ట్రేషన్‌పై కేసు

తాడికొండ, న్యూస్‌టుడే : నకిలీ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై తాడికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వున్నవ శ్రీనివాసరావు గుంటూరు పట్టాభిపురానికి చెందిన కొల్ల శరత్‌చంద్ర అనే వ్యక్తి వద్ద నుంచి రూ.20 లక్షల నగదు తీసుకున్నాడు. లాం గ్రామంలో సర్వే నం: 277-ఎలో ప్లాటు నం: 238, 239 ప్లాట్లు ఉన్నాయని నకిలీ రిజిస్ట్రేషన్ చేశాడు. తర్వాత అది నకిలీదని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు తాడికొండ సీఐ వాసు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



సృష్టికి మూలం.. శక్తి రూపం


కృష్ణమ్మకు నదీ హారతి..


నగరోత్సవం

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వెళ్లే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీమాతను దర్శించుకోవడానికి బుధవారం తెల్లవారుజాము నుంచే లక్షల మంది బారులుదీరారు. - న్యూస్‌టుడే బృందం


ఆలయంలో పూలతో అలంకారం..


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలిచేందుకు వచ్చిన నృత్యకారిణులు


కెనాల్ రోడ్డు వద్ద క్యూలైన్లలో భక్తులు


కేరళ డప్పు వాయిద్యాలతో..


మహిళలు, చిన్నారుల కోలాటం


మూలానక్షత్రం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున బారులు


వన్‌టౌన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుపై ఆంక్షలతో భక్తుల అగచాట్లు


హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి బస్టాండ్ వైపు నిలిచిన ట్రాఫిక్




భక్తులకు తాగునీరు అందిస్తూ..


నదిలో బోట్లలో ఏర్పాటు చేసిన నవదుర్గల బొమ్మలు

11 నుంచి నారీశక్తి ఉత్సవం

కృష్ణానది తీరాన నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానది తీరాన పున్నమి ఘాట్ వద్ద ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న నారీశక్తి ఉత్సవం కార్యక్రమానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నదీ తీరం వెంబడి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి వేదికల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇసుక తీసుకొచ్చే బోట్లలో నవదుర్గల భారీ బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వేదిక వెనుక వైపున కృష్ణానదిలో వాటిని బోట్లలో ఏర్పాటు చేశారు. స్టాల్స్ పనులు కూడా చేస్తున్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలు...

ఆపత్కాలంలో ఆయువు నిలిపేలా..!

రైలు ప్రమాదాల్లో సహాయక చర్యలపై మాక్ డ్రిల్


బోగీల్లో చిక్కుకున్న వారిని కాపాడుతున్న భద్రతా సిబ్బంది

వేజండ్ల(చేబ్రోలు), న్యూస్‌టుడే: పట్టాలపై చెల్లాచెదురుగా బోగీలు.. చుట్టూ ఎన్డీఆర్‌ఎఫ్, భద్రతా బలగాలు, రైల్వే పోలీసులు.. అంబులెన్సులు.. భారీ క్రేన్లు.. ఇదేంటి ఏదైనా ఘోర ప్రమాదం సంభవించిందేమో అని ఉలిక్కిపడుతున్నారా.. అయితే ఒక్క క్షణం ఆగండి. ఇదంతా ఆపత్కాలంలో సహాయక బృందాలు, భద్రతాసిబ్బంది ఎలా స్పందించాలో చూపే 'మాక్ డ్రిల్' అంతే. చేబ్రోలు మండలం వేజండ్ల రైల్వే స్టేషన్‌లో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్రేన్ సహాయంతో బోగీపై బోగీని ఏర్పాటు చేసి అందులో ప్రయాణికుల మాదిరిగా కొంతమంది సిబ్బందిని ఉంచారు. అనంతరం బోగీల కిటికీలు, పై భాగాన్ని యంత్రాలతో కత్తిరించి లోపలి వారిని బయటకు తీసుకురావడం, గాయాలపాలైన వారిని వెంటనే అంబులెన్సుల్లో వైద్యశాలకు తరలించడం తదితర కృత్యాలు నిర్వహించారు. పక్కనే సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల బంధువులకు వారి వివరాలను అందించడం, పొగ, మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించడం తదితర అంశాలను రైల్వే, ఆర్పీఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, స్థానిక భద్రతా బలగాలు ఆచరణాత్మకంగా చూపారు. ఈ సందర్భంగా రైల్వే సౌత్ సెంట్రల్ జోనల్ ముఖ్య భద్రతా అధికారి రమణారెడ్డి మాట్లాడుతూ సహాయక చర్యల్లో ఎదురవుతున్న సవాళ్లు, లోపాలను సరిదిద్దుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సాంకేతికత సాయంతో రైల్వే వ్యవస్థ మెరుగుపడి ప్రమాదాలు తగ్గాయన్నారు. జోన్ పరిధిలో ఆరు డివిజన్లు ఉండగా ఒక్కో ఏడాది ఒక్కో చోట మాక్ డ్రిల్ నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ, పలువురు రైల్వే, ఆర్పీఎఫ్, 10వ బెటాలియన్ ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న రమణారెడ్డి

ఏపీలో ప్రకృతి సాగు భేష్

- ఎరుకలపూడిలో పర్యటించిన తెలంగాణ అధికారుల బృందం


రైతులతో సమావేశమైన తెలంగాణ అధికారుల బృందం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్న ప్రకృతి సాగు బాగుందని, సమానా విధానాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేయనున్నట్లు ప్రయత్నిస్తామని తెలంగాణ అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం, అక్కడి ఎఫ్‌పీవో ప్రతినిధులు, పలువురు రైతులతో కలిసి తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామంలో బుధవారం పర్యటించి ప్రకృతి సాగు తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్ అధికారులకు ఇక్కడి సాగు వివరాలు, తీరును తెలియజేశారు. రెండు ఎకరాల భూమి ఉన్న రైతులకు నెలకు రూ.25 వేల నికర ఆదాయం వచ్చేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, వచ్చే మూడు సంవత్సరాల్లో లక్ష మంది రైతులు, 2029 నాటికి మూడు లక్షల మంది రైతులను ఆ స్థాయికి తీసుకురావటానికి కృషి చేస్తున్నామని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, ఉన్నతాధికారులు శివప్రసాద్, జమునారాణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామాంజనేయులు తదితరులు పర్యటనకు వచ్చారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అదే రైలు నంబరు 07216 ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బండి ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది.

ఎస్సీ వర్గీకరణ అంశంపై గోడ మీద పిల్లిలా వైకాపా

మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అంశంపై వైకాపా గోడ మీద పిల్లిలా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఎస్సీ వర్గీకరణ సమస్య 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కూటమి ప్రభుత్వం ఆహ్వానించింది. వైకాపా తప్ప అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇస్తున్నాయి. అధికారం కోల్పోవడంతో వైకాపా నేతలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. 86 లక్షల ఎస్సీ జనాభాలో మాలలు 44 లక్షల మంది ఉన్నారు. వర్గీకరణతో వారికే రిజర్వేషన్ల రూపంలో అధిక ప్రయోజనం కలుగుతుంది. గత వైకాపా ప్రభుత్వం కులగణన చేసిన వివరాలు వెల్లడించలేదు. వైకాపా రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ అంశాన్ని వాడుకొంది. వర్గీకరణ అమలు కోసం ఈనెల 11న మాదిగ సంఘాల ఆధ్వర్యంలో దుర్గామాతకు పూజలు చేస్తాం. త్వరలో గవర్నర్, మంత్రులతో పాటు అఖిలపక్ష నేతల్ని కలుస్తాం' .. అని ఆయన వివరించారు.

ఎవరెస్ట్ అధిరోహణకు ఎస్ఆర్ఎం విద్యార్థులు


ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు వెళ్లనున్న ఎస్ఆర్ఎం విద్యార్థులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : ఏపీ ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ విద్యార్థులు మరో సహసోపేత యాత్రకు శ్రీకారం చుట్టారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు సన్నద్ధమవుతున్నారు. వీరితో పాటు పలువురు అధ్యాపకులు ఇందులో పాల్గొంటున్నారు. గురువారం ఉదయం యూనివర్శిటీ ఆవరణలో ఈ బేస్ క్యాంప్ యాత్రను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు బయలుదేరిన విశ్వవిద్యాలయంగా ఎస్ఆర్ఎం గుర్తింపు పొందనుంది. విద్యార్థులకు ఉన్నత చదువులతో పాటు శాస్త్రీయ పరిశీలన, క్షేత్రస్థాయి పర్యటనలు అవసరమని, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, దృఢత్వం పెంపొందించే క్రమంలో ఈ యాత్రకు ఎస్ఆర్ఎం శ్రీకారం చుట్టింది. యాత్రకు బయలుదేరి వెళ్లనున్న 18 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. అధిరోహణకు అనుమతులు తీసుకున్నారు. ఈ నెల 10న యాత్ర ప్రారంభమై 28న ముగియనుందని వర్శిటీ డైరెక్టర్ సిద్ధార్థ శంకర్ త్రిపాఠి బుధవారం తెలిపారు.

యూట్యూబర్‌పై ఫిర్యాదు

తాడేపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన దాసరి విజ్ఞాన్ అనే యూట్యూబర్ సినీ క్రిటిక్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో అసత్య, అసభ్యకరమైన ఆరోపణలు చేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని సస్పెన్షన్‌లో ఉన్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శాంతి బుధవారం రాత్రి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయవాది పృథ్వీరాజ్‌తో కలిసి ఆమె తాడేపల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చారు. వ్యక్తిగత జీవితంపై అసభ్యకరంగా, అసత్య ఆరోపణలు చేస్తూ పెళ్లికి ముందు, తర్వాత జీవితంపై వీడియోలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని, అభ్యంతరకరమైన వ్యాఖ్యలను చేస్తూ వేధిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాది పృథ్వీరాజ్ విలేకరులతో మాట్లాడారు. శాంతిపై వ్యక్తిగతంగా అసత్య ఆరోపణలు చేయకూడదని, అసభ్యకరంగా మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టకూడదని, కామెంట్లు చేయకూడదని హైదరాబాద్ సిటీ న్యాయస్థానం గత జూన్‌లో గ్యాగ్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఇందుకు విరుద్ధంగా దాసరి విజ్ఞాన్ గత ఆగస్టు నుంచి యూట్యూబ్‌లో వీడియోలు విడుదల చేశారని చెప్పారు. ఇందులో అసభ్యకరంగా, అసత్య లైంగిక ఆరోపణలు చేస్తూ తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేశారన్నారు. అతడితోపాటు మరికొందరు శాంతిని కించపరుస్తూ వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నారన్నారు. వారిపై కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

పీఎం స్వానిధితో చిరువ్యాపారులకు చేయూత


మాట్లాడుతున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్, పీడీ విజయలక్ష్మి, డీసీ శ్రీనివాసరావు తదితరులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రధానమంత్రి స్వానిధి ద్వారా చిరువ్యాపారులకు ఆర్థిక చేయూత అందుతుందని, గుంటూరు నగరంలోని వీధివ్యాపారులను స్వానిధి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. బుధవారం 'స్వానిధి సే సమృద్ధి' వారోత్సవాల్లో భాగంగా జీఎంసీ కౌన్సిల్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వానిధిలో వీధి వ్యాపారులను నమోదు చేయడం ద్వారా 8 రకాల సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఆర్పీలు తమ పరిధిలోని వీధివ్యాపారులకు పథకంపై అవగాహన కల్పించి ఈ నెల 7 నుంచి 12వ తేదీలోపు వారోత్సవాల్లో అర్హులను నమోదు చేయాలన్నారు. వీధివ్యాపారులు తగిన ధ్రువపత్రాలతో స్వానిధిలో నమోదు కావడం ద్వారా వారికి తొలుత రూ.10 వేలు, సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేలు, తర్వాత రూ.50 వేలు అతి తక్కువ వడ్డీరేటుకు రుణాలను బ్యాంకులు అందిస్తామని చెప్పారు. జీఎంసీ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తగిన తోడ్పాటు అందిస్తామని తెలిపారు. సమావేశంలో మెప్మా పీడీ టీవీ విజయలక్ష్మి, జీఎంసీ డీసీ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సజీల, ఉపాసెల్ పీవో బాలాజీ బాషా, సీడీపీవో కృష్ణవేణి, బ్యాంకు మేనేజర్లు, ఆర్పీలు, సీఎంఎంలు తదితరులు పాల్గొన్నారు.

భాజపా నేత వ్యవహారంపై రాష్ట్ర అధిష్ఠానం సీరియస్

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

గుంటూరు(నగరంపాలెం), న్యూస్‌టుడే: జిల్లా భాజపా నేత ఓ మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుమారం చెలరేగింది. ఈవిషయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై రాష్ట్ర పార్టీ వివరణ కోరింది. జిల్లా భాజపా నేత ఆ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తతో అసభ్యకరమైన మాటలు, ద్వంద్వ అర్థాలు వచ్చేలా చేసిన సంభాషణ మంగళవారం మధ్యాహ్నం నుంచి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న నేత మహిళతో అసభ్యకరంగా వీడియో కాల్‌లో మాట్లాడటంపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఈవిషయమై రాష్ట్ర పార్టీ బుధవారం సమావేశమై ఏం చేయాలో సమాలోచనలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న భాజపా నేత మహిళతో అసభ్యకరమైన సంభాషణ చేయడంతో రాజకీయంగా ఇబ్బందికర పరిణామంగా మారింది. దీంతో పార్టీ అధిష్ఠానం అతన్నే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో జిల్లా పదవి నుంచి వైదొలగాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గురువారం ఉదయం లాలుపురం రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించేందుకు పార్టీ సన్నద్ధమైంది. ఈ సమావేశంలో ప్రస్తుత పరిణామాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

114 గ్రామాలు.. 160 పనులు

కలెక్టరేట్(గుంటూరు): పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల్లో ఉపాధి హామీ పథకంలో మంజూరు చేసిన పనుల శంకుస్థాపన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో బుధవారం సమీక్షించారు. అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించాలని, సంక్రాంతి పండగ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారన్నారు. జిల్లాలోని 114 గ్రామాల్లో ఉపాధి హామీ కింద రూ.13.93 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల ఏర్పాటు, అభివృద్ధికి సంబంధించి 160 పనులకు పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేశారన్నారు. శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ షెడ్యూల్‌ను వెంటనే అందించాలన్నారు. పనుల నిర్వహణకు సంబంధించి గ్రామ సభల్లో తీర్మానాలు చేసి ఏజెన్సీల ఎంపిక పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. వీసీలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్ పాల్గొన్నారు.

అత్త చెవి కొరికిన కోడలిపై కేసు

తుళ్లూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో అత్త చెవిని కొరికేసిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. ఈ నెల 6న స్థానిక బాలయేసు కాలనీలో అత్తకోడళ్లు గొడవ పడ్డారు. ఈ క్రమంలో అత్త నాగమణి చెవిని కోడలు పావని బలంగా కొరికేయడంతో కొంతభాగం తెగి పడింది. అప్పటికే పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరు నుంచి అక్కడికి వచ్చిన పావని తల్లిదండ్రులు ఈపూరి వీరయ్య, మరియమ్మ, ఏసమ్మ నాగమణిని ఇంటిలో నుంచి బయటకు ఈడ్చుకొచ్చి తీవ్రంగా కొట్టడం ఆరంభించారు. విషయం తెలిసి పోలీసులు అక్కడకు రావడంతో ఆమెను వదిలేశారు. అనంతరం బాధితురాలు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అప్పటికే ఆలస్యం కావడంతో చెవి భాగం అతికించి శస్త్రచికిత్స చేయడం వీలు పడదని వైద్యులు చెప్పారు. ఈ విషయమై బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.